నవతెలంగాణ
నడుస్తున్న తెలంగాణ దినపత్రిక
ఆదిలాబాద్
బుధవారం | నవంబర్ 27, 2024 | www.navatelangana.com

శైలజ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి

కౌటాల : శైలజ మృతికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని మాలి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదే వసంత్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మాలి సంక్షేమ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యార్థిని మృతికి అధికార యంత్రాంగం, ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. కుటుంబానికి ఒక ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు, రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు నాందేవ్, సెండే ముక్తేశ్వర్, మోర్లె పాండురంగ్, వడాయి వెంకటి, నికోడే సంతోష్, మందాడే భీంరావ్ పాల్గొన్నారు.



సర్వే వివరాలు తప్పుల్లేకుండా నమోదు చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: సమగ్ర కుటుంబ సర్వే వివరాలను ఎప్పటికప్పుడు ఎలాంటి తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అదనపు కలెక్టర్ శ్యామలదేవి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్ట్స్, కామర్స్, పాలిటెక్నిక్ కళాశాలలో కొనసాగుతున్న ఆన్‌లైన్ డాటా ఎంట్రీ కేంద్రాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వివరాల నమోదు తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. అక్కడి నుంచి జిల్లా కేంద్రంలోని మహాత్మ జ్యోతి బాపూలే వసతిగృహాన్ని తనిఖీ చేశారు. వంట గదితో పాటు తరగతి గదులను పరిశీలించి పరిశుభ్రత పాటించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం రుచి కరమైన భోజనం వడ్డించాలన్నారు.



ఆశ్రమాల్లో ప్రమాద ఘంటికలు

- తరుచూ అస్వస్థతకు గురవుతున్న విద్యార్థులు
- పనిచేయని వాటర్ హీటర్లు..చన్నీటితోనే స్నానాలు
- శుద్ధనీరు లభించక బోరు నీరే తాగుతున్న వైనం
- ఆశ్రమ పాఠశాలలను వెంటాడుతున్న అసౌకర్యాలు
- అధికారుల పర్యవేక్షణ లేక విద్యార్థుల అవస్థలు

నిరుపేద గిరిజన విద్యార్థులకు వరంలా మారిన ఆశ్రమ పాఠశాలల్లో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. వివిధ కారణాలతో విద్యార్థులు తరుచూ అస్వస్థతకు గురవుతున్నారు. నాణ్యమైన చదువు పక్కన పెడితే.. కనీస సౌకర్యాలకు కూడా నోచుకోవడం లేదు. రోజువారీ భోజనంలో మెనూ అమలు చేయకపోవడం.. కిచెన్లు, పరిసరాలు అపరిశుభ్రత, హాస్టల్ గదులు సక్రమంగా లేకపోవడం కారణంగా విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. తాజాగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి ఆశ్రమ పాఠశాల విద్యార్థిని శైలజ ఫుడ్ పాయిజన్ కారణంగా మృతిచెందడం అందరినీ కలిచివేసింది. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశం కావడంతో ఆశ్రమ పాఠశాలల్లో పరిస్థితులను తేటతెల్లం చేస్తోంది. ఈ పాఠశాలల పర్యవేక్షణకు మూడంచెల వ్యవస్థ ఉన్నా సక్రమంగా పనిచేయడం లేదు. అటు ప్రభుత్వాలు సైతం వీటి నిర్వహణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో నిరుపేద గిరిజన విద్యార్థులు కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదనే విమర్శలున్నాయి.



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కొలాం ఆశ్రమ పాఠశాలో ఆరు బయట స్నానాలు చేస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

గిరిజన విద్యార్థులకు వసతితో కూడిన విద్యనందించేందుకు ప్రభుత్వం ఆశ్రమ పాఠశాలలను నెలకొల్పింది. ఐటీడీఏల పర్యవేక్షణలో నిర్వహించే ఈ పాఠశాలలు మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యనందిస్తున్నాయి. ఫలితంగా ఏజెన్సీ ప్రాంతంలోని వేలాది మంది విద్యార్థులు వీటిలో చేరి చదువులు సాగిస్తున్నారు. ప్రభుత్వం వీటికి గురుకులాల మాదిరిగానే పౌష్టికాహారంతో కూడిన మెనూ అమలు చేస్తోంది. ఐటీడీఏ పరిధిలో 133 ఆశ్రమ పాఠశాలలు ఉండగా వీటి పరిధిలో 33,071మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.ఈ పాఠశాలల్లో నాణ్యమైన లభించడం మాట పక్కనపెడితే.. అసౌకర్యాలు మాత్రం ఏండ్లుగా వేధిస్తున్నాయి. ప్రభుత్వాలు సక్రమంగా నిధులు కేటాయించకపోవడం.. ఉన్న వాటిని సక్రమంగా వినియోగించలేని కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ముఖ్యంగా మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదనే అనేక ఆరోపణలు వస్తున్నా అధికార యంత్రాంగం అంతగా దృష్టిసారించడం లేదు. కిచెన్ గదులు, పరిసరాలు అపరిశుభ్రత కారణంగానూ సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రతి ఏటా ఎక్కడో చోట ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గురికావడం సాధారణ విషయంగా మారింది. వీటిని కట్టడి చేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంలేదనే విమర్శలున్నాయి. ముఖ్యంగా



కెరమెరి మండలం బాబేఝరిలో పని చేయని వాటర్ హీటర్లు

ఏటీడీఓ నుంచి పీఓ వరకు మూడంచెల పర్యవేక్షణ వ్యవస్థ ఉన్నప్పటికీ ఫలితం కనిపించడం లేదనే వాదనలు ఉన్నాయి. కొన్ని మారుమూల పాఠశాలలకు అధికారులు నెలల తరబడి వెళ్లడం లేదనే అభిప్రాయం ఉంది. పెట్టింది తింటారనే ఉద్దేశంతో కొందరు వసతిగృహ అధికారులు విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

చన్నీటితోనే స్నానాలు..!

ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు చలికాలంలో వేడినీటిని అందించేందుకు కొన్నేండ్ల క్రితం ప్రతి పాఠశాలలో సోలార్ వాటర్ హీటర్లు ఏర్పాటుచేశారు. ప్రస్తుతం అనేక పాఠశాలల్లో ఈ పరికరాలు మరమ్మతులకు గురయ్యాయి. కానీ టెక్నీషియన్లు రావాలనే ఉద్దేశంతో పాటు నిధులు లేవనే కారణంగా వీటిని బాగు చేయించడం లేదు. ఫలితంగా విద్యార్థులు ప్రతి ఏటా చలిలో చన్నీటితోనే స్నానాలు చేయాల్సి వస్తోంది. రాష్ట్రంలో కనిష్ట ఉష్ణోగ్రతలు ఉమ్మడి జిల్లాలోనే నమోదు కావడం.. గజగజ వణికిస్తున్న చలిలోనే విద్యార్థులు చల్లటి నీటితో స్నానం చేయడం మూలంగా అనారోగ్యానికి గురవుతున్న సందర్భాలున్నాయి. మరోపక్క శుద్ధనీటిని అందించేందుకు ఏర్పాటుచేసిన పరికరాలు సైతం అనేక చోట్ల చెడిపోవడంతో విద్యార్థులు బోరు నీరే తాగుతున్నారు. నీటి కలుషితం కారణంగానూ విద్యార్థులను అనారోగ్య సమస్యలు పట్టిపీడిస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రభుత్వాల నిర్లక్ష్యమూ కారణమే..!

ఆశ్రమ పాఠశాలల నిర్వహణలో పర్యవేక్షణ లేమి సమస్యలు ఉండటంతో పాటు ప్రభుత్వ నిర్లక్ష్యమూ అదే స్థాయిలో కనిపిస్తోంది. ప్రతి నెలా మెస్ బిల్లులు విడుదల చేయాల్సిన ప్రభుత్వాలు నెలల తరబడి పెండింగ్‌లో పెట్టడంతో హాస్టల్ నిర్వాహకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానోపాధ్యాయుడు లేదంటే హాస్టల్ వార్డెన్ సొంత డబ్బులు వెచ్చించి సరకులు కొనుగోలు చేసి పెట్టాల్సి వస్తోంది. ఒక్కో ఆశ్రమ పాఠశాలలో 500 నుంచి వెయ్యి మంది వరకు విద్యార్థులు ఉండగా వారందరికీ ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం పెట్టాలంటే నిధుల సమస్య ఉత్పన్నమవుతోంది. ప్రస్తుతం మూడు నెలలకు ఒకసారి మెస్ బిల్లులు వస్తుండటంతో నిర్వాహకులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత కొన్నేండ్లుగా ఇదే సమస్య ఉండటంతో అధికారులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలుస్తోంది. మెస్ బిల్లులతో పాటు వసతిగృహాల నిర్వహణకు సంబంధించి నిధులు సైతం రాకపోవడం కారణంగా సౌకర్యాలు కల్పించలేకపోతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికీ అనేక పాఠశాలలకు కిటికీలకు తలుపులు లేకపోవడం.. సరిపడా మరుగుదొడ్లు సైతం లేకపోవడంతో విద్యార్థులు అసౌకర్యాల మధ్య చదువులు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారుల నిరంతర పర్యవేక్షణతో పాటు ప్రభుత్వం సైతం వీటిపై ప్రత్యేక దృష్టిసారించి సౌకర్యాలు కల్పిస్తే నిరుపేద గిరిజన విద్యార్థులకు ప్రయోజనకరంగా మారనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

బీఎంఆర్ విజ్ఞాన కేంద్ర ప్రారంభోత్సవ సభను జయప్రదం చేయండి



నవతెలంగాణ-జైనథ్

బీఎంఆర్ విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవ సభను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న అన్నారు. మంగళవారం తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బహిరంగ సభ పోస్టర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆశన్న మాట్లాడుతూ నవంబర్ 28న సిఐటియు జిల్లా కార్యాలయం(బీఎంఆర్ విజ్ఞాన కేంద్రం) ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్మికులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి మాజీ రాజ్యసభ సభ్యులు బృందాకరత్, మాజీ పార్లమెంటు సభ్యులు మీడియం బాబురావు, మాజీ శాసనమండలి సభ్యులు చెరుపల్లి సీతారాములు, సిఐటియు అఖిలభారత కోశాధికారి ఎం.సాయిబాబు, సిఐటియు తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రవికుమార్, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జయలక్ష్మి, ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆశాలత హాజరవుతున్నారని తెలిపారు. కార్మిక పోరాటాల సారథి, ఐక్య ఉద్యమాల వారధి, కార్మిక సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తున్న సీఐటీయూ జిల్లా కార్యాలయం ప్రారంభమనేది జిల్లా కార్మిక వర్గానికి పండుగలాంటిదని తెలిపారు. కార్యాలయం ప్రభుత్వాల కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడే వారికి కేంద్రంగా పనిచేస్తుందన్నారు. ప్రారంభోత్సవ సభకు కార్మికులు, ప్రజలు, శ్రేయోభిలాషులు వేలాది సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ మండల అధ్యక్షుడు అడెల్లు, నాయకులు గోదురు ఊశన్న, రామన్న, దుమాల అశోక్, పోతారాజ్ పాల్గొన్నారు.

ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ ఏరియా జీఎం కార్యాలయంలో ఇన్చార్జి జనరల్ మేనేజర్ శ్రీనివాస్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. శ్రీరాంపూర్ ఓసీపీలో గని మేనేజర్ బ్రహ్మాజీ, ఆర్కె-6 గనిలో మేనేజర్ తిరుపతి వేడుకలను ప్రారంభించారు. అనంతరం వారు భారత రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞను చదివించారు. అనంతరం మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్ అందరికీ ఆదర్శప్రాయుడని అన్నారు. భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా రూపొందించిన అంబేద్కర్ అభినందనీయులని తెలిపారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం శ్రీరాంపూర్ ఏరియా బ్రాంచ్ సెక్రటరీ బాజీసైదా, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షులు, ఎస్ఈ లైజెన్ ఆఫీసర్ కిరణ్ కుమార్, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎం కె.చిరంజీవులు, ఇన్చార్జి డిజిఎం పర్సనల్ రాజేశ్వర్, పర్చేస్ అధికారి చంద్రశేఖర్, ఏరియా ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మి, ఆర్ అండ్‌బి అధికారి అమర్నాథ్‌రెడ్డి, లా అధికారి ప్రబంధిత, ఐటి ప్రోగ్రామర్ శ్రీనివాస్, సీనియర్ పీఓ పి.కాంతారావు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు అధికారులు సమిష్టిగా కృషి చేయాలి



నవతెలంగాణ-జైపూర్

రామగుండం కమిషనరేట్ పరిధిలో నేరాల నియంత్రణకు అధికారులు సమన్వయంతో సమిష్టిగా కృషి చేయాలని సీపీ శ్రీనివాస్ సూచించారు. వార్షిక తనిఖీలో భాగంగా మంగళవారం రాత్రి జైపూర్ ఏసీపీ కార్యాలయం తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. ఏసీపీ ఆధ్వర్యంలో దర్యాప్తు జరిపిన కేసులు ప్రస్తుత స్థితిగతులపై ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ కేసులు, ఇతర గ్రేవ్ కేసుల వివరాలు ఏసీపీ వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడిన వారిని ఎట్టి పరిస్థితుల్లో వదలమన్నారు. జైపూర్ సబ్ డివిజన్ పరిధిలో మావోయిస్టు ప్రభావిత గ్రామాలు, మహారాష్ట్ర సరిహద్దుగా ఉన్నందున ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ నిఘా ఏర్పాటు చేసి సమాచార వ్యవస్థను పటిష్ఠం చేయాలని సూచించారు. గంజాయి ఏరియా డామినేషన్, క్యూబింగ్, కమ్యూనిటీ కాంట్రాక్ట్ కార్యక్రమాలు నిర్వహిస్తూ మారుమూల గ్రామాలను సందర్శించాలని, పెట్రి పాయింట్స్ విజిట్స్ చేయాలని అధికారులను ఆదేశించారు. రామగుండం కమిషనరేట్ పరిధిలో గంజాయికి సంబంధించిన నమోదు చేసిన 66 కేసుల్లో పట్టుబడిన 530 కిలోల గంజాయి రూ.కోటీ30లక్షల30వేల విలువగలది నిబంధనల మేరకు డిస్పోజ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్‌తో పాటు పోలీస్ ఇన్స్‌పెక్టర్లు రవీందర్, సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

కనీస వేతనం, ఉద్యోగ భద్రతకు పోరాడుదాం

నవతెలంగాణ-మంచిర్యాల

కార్మిక, రైతంగ హక్కులను కాలరాస్తున్న బీజేపీ పాలనకు చరమగీతం పాడి కనీస వేతనం, ఉద్యోగ భద్రత, ప్రభుత్వరంగ సంస్థల రక్షణకు పోరాడుదామని జాయింట్ ప్లాట్ ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ - సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు పేర్కొన్నారు. దేశ వ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా వద్ద కేంద్ర ప్రభుత్వ బీజేపీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతోందన్నారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసం దేశ స్వాతంత్ర్యాన్ని, స్వావలంబనను తాకట్టు పెడుతోందన్నారు. ధరలు పెంచి వ్యవసాయరంగం, ఆహార ఉత్పత్తులకు సబ్సిడీలో భారీగా కోతలు విధించిందని, పౌరుల ప్రాథమిక హక్కులను హరిస్తోందని మండిపడ్డారు. 61సింగరేణి బొగ్గు బ్లాకులను ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తోందని, స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించడం లేదని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు, సిఐటియు జిల్లా కార్యదర్శి దుంపల



రంజిత్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు గోమాస ప్రకాష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి లాల్‌కుమార్, ఐద్వా జిల్లా నాయకురాలు ఉమారాణి, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు బ్రహ్మం, పిఓడబ్ల్యూ రాష్ట్ర నాయకులు మంగ, జాడి దేవరాజ్, ఖలీందర్‌ఖాన్, కుమార్, రాము, పోశం, ప్రవీణ, శారద, పుష్పలత, సుజాత పాల్గొన్నారు.

లక్షెట్టిపేట : జాయింట్ ప్లాట్ ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, సంయుక్త కిసాన్ మోర్చా దేశ వ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం మండలంలోని గాంధీ చౌక్ వద్ద సీఐటీయు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి సంకీర్ణ ప్రభుత్వం కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతోందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలపై నాలుగు సంవత్సరాలు నుండి రైతులు, కార్మికులు ఎన్నో పోరాటాలు చేశారని తెలిపారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని ప్రజాసంఘాల డిమాండ్లను పరిష్కరించే దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రాజయ్య, రాజలింగు, దుర్గయ్య, గంగన్న, వెంకటేష్, భూమయ్య, అశోక్ పాల్గొన్నారు.



పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి

- డిసెంబర్ 1న వార్షికోత్సవ సదస్సును విజయవంతం చేయాలి
- రైతు సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు, రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి చంద్రకుమార్



నవతెలంగాణ-జన్నారం

రైతులు పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షులు, రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని రేండ్లగూడలో ఏర్పాటు చేసిన రైతు సదస్సులో మాట్లాడారు. రైతులు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలు చేసుకోవద్దన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసు మేరకు కనీస మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాలు దాటిన కౌలు రైతుకు, రైతు కూలీలకు రూ.15000 పెన్షన్ ఇవ్వాలన్నారు. రైతులకు పంట బీమా కల్పించాలన్నారు. అతివృష్టి, అనావృష్టితో నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని కోరారు. సేంద్రియ ఎరువులను సబ్సిడీ ద్వారా అందించాలని, నకిలీ విత్తనాలు అరికట్టాలని పేర్కొన్నారు. నకిలీ విత్తనాలు ఉత్పత్తి చేసే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని, నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇప్పించాలని, కౌలు రైతుకు రక్షణ కల్పించి రైతులకు అందించే రైతుబంధు, రుణమాఫీ కొనసాగించాలని తెలిపారు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, అసైన్మెంట్ భూములను ప్రభుత్వం తిరిగి తీసుకోకూడదన్నారు. పరిశ్రమల కొరకు రైతుల నుండి భూమి సేకరిస్తే భూమికి బదులు మరోచోట అదే స్థాయిలో భూమి ఇవ్వాలన్నారు. రైతుల డిమాండ్లను నెరవేర్చడం కోసం రైతు సంక్షేమ సమితి ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొస్తోందని తెలిపారు. తెలంగాణ రైతు సంక్షేమ సమితి ఆధ్వర్యంలో డిసెంబర్ 1న ఉదయం 11గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే ఐదో వార్షికోత్సవ సదస్సుకు రైతులు తరలొచ్చి విజయవంతం చేయాలని కోరారు. సదస్సు అనంతరం అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు భరత్‌కుమార్ ఆధ్వర్యంలో చంద్రకుమార్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మామిడిపల్లి ఇందయ్య, ఏనుగు సుభాష్ రెడ్డి బోర్లకుంట ప్రభుదాస్ జాడి వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో రైతు సంక్షేమ సమితి సభ్యులు ఇంద్రసేన నరసింహ, వెంకటరెడ్డి, కొండగర్ల పవన్‌కళ్యాణ్, అల్లం లచ్చన్న, ఏనుగు సుభాష్‌రెడ్డి, బోర్లకుంట ప్రభుదాస్, అల్లం నరేష్, కేఏ నరసింహులు, సహదేవ్, మల్లయ్య, బుచ్చయ్య, అశోక్ పాల్గొన్నారు.

జాతీయ రహదారుల నిర్మాణానికి సహకరించాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-జైపూర్

జిల్లా పరిధిలో మంచిర్యాల-వరంగల్, ఖమ్మం-విజయవాడ మధ్య నిర్మించనున్న జాతీయ రహదారి నెం.163 నిర్మాణానికి ప్రజలు సహకరించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. రుమ్మీపూర్‌లో ప్రారంభమైన జాతీయ రహదారి నెంబర్ 163 పనులను ఆర్‌డీఓ శ్రీనివాస్‌రావుతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణంలో 334 కిలో మీటర్ల మేర ఉంటుందని, జిల్లా ప్రజలు రహదారి నిర్మాణానికి సహకరించాలని కోరారు. రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన వారి జాబితా ప్రకారం బాధితులకు నష్టపరిహారం చెల్లించడం జరిగిందని, చెట్లు, బోర్లు నష్టపోయినవారు ఆలస్యం చేయకుండా పరిహారం కోసం దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. అనంతరం మండలంలోని కుందారం గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులు నిబంధనలు పాటిస్తూ నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. కొనుగోలు కేంద్రంలో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో పాటు సన్న రకాలకు రూ.500 బోనస్ ఇవ్వడం జరుగుతుందన్నారు.



17శాతం తేమ కంటే తక్కువగా ఉండాలని, తాలు, మట్టి గడ్డలు లేకుండా నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యం తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వనజారెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వంటశాలను పరిశుభ్రంగా ఉంచాలి

తాండూర్ : గురుకుల పాఠశాలల్లో వంటశాలలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్పెషల్ ఆఫీసర్ అంజయ్య తెలిపారు. ఎంపీడీవో శ్రీనివాస్‌తో కలిసి తాండూర్ కస్తూర్బా గురుకులాని సందర్శించారు. వంటశాలలోని కూరగాయలు, కిరాణా సామాగ్రిని, వంట పాత్రలను పరిశీలించారు. అనారోగ్య పరిస్థితుల్లో పిల్లలకు అందించే మాత్రలు, టానిక్‌ల గడువుతేదిని పరిశీలించారు. కాలం చెల్లిన మాత్రలను ఎప్పటికప్పుడు మార్చాలని సూచించారు. వంటశాలను వంట పాత్రలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. వంటలో నాణ్యమైన బియ్యం, పప్పులను వాడాలన్నారు. ప్రభుత్వం చార్జీలు పెంచినందున మెనూ అనుసరించి నాణ్యమైన అల్పాహారం, భోజనాలను అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఓ కవిత ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని మలక్ చించోలి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి 2007-2008 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు మంగళవారం అడెల్లి పోచమ్మ ఆలయ ప్రాంగణంలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నప్పుడు కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు 16



ఏండ్ల తర్వాత కలుసుకొని వారి నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆట, పాటలతో దినమంతా సంతోషంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గురువులు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సరైన భోజనం అందించాలి

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

నిర్మల్ మండలం రత్నాపూర్ కాండ్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను డీఈఓ రామారావు సందర్శించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. విద్యార్థుల హాజరు శాతం మెరుగుపరచాలని, ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను చక్కగా అవగాహన చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పది పరీక్షల్లో 10 జీపీఏ మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు, మంచి గుర్తింపును తీసుకురావాలన్నారు.



ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని చించోలి(బి) డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చౌక్ వద్ద మంగళవారం 75వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ ముఖ్యఅతిథిగా హాజరై, భారత రాజ్యాంగానికి సంబంధించిన అంశాలను వివరించారు. భారత రాజ్యాంగం జాతి, మత, కుల బేధాలు లేకుండా అందరికీ సమాన హక్కులు కల్పించిందని చెప్పారు. భారతదేశాన్ని ఐక్యంగా నిలిపేందుకు రాజ్యాంగం కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అంబేద్కర్ సంఘ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉట్నూర్ : భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఐటీడీఏ ప్రాంగణంలో యూనిట్ అధికారులు ఘనంగా రాజ్యాంగ దివస్‌ను నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలతో నివాళులర్పించారు. భారత పౌరులకు ప్రాథమిక హక్కులు, సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం కల్పిస్తున్న భారత రాజ్యాంగాన్ని, రాజ్యాంగ దినోత్సవాన్ని అన్ని మతాల వారు తమ మత గ్రంథాలకు సమానంగా గౌరవించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ వసంతరావు, ఏపీఓ పీవీటీజీ మెస్రం మనోహర్, దామోదర్ స్వామి, ఐటీడీఏ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో 75వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజ్యాంగంలోని పీఠికను చదివి ప్రతిజ్ఞ చేశారు. రాజ్యాంగాన్ని ఆమోదించి 75 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా రెండు మామిడి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సంగీత మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన అవకాశాలను అందిపుచ్చుకొని విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కెప్టెన్ జగ్‌రామ్ అంతర్వేది, డాక్టర్ అరుణ్ కుమార్, సంతోష్ కుమార్, చక్రవర్తి, శ్రావణి, శ్రీధర, జోత్స్న, మంజుల, జ్ఞానేశ్వర్, రాజేశ్వర్, సంజీవ్ పాల్గొన్నారు.

తలమడుగు : భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తలమడుగు గ్రామ ఉపాధ్యక్షులు కాడే శశివర్ధన్, మండల కేంద్రంలోని మాల, మహర్ సంక్షేమ సంఘం సభ్యులు మాజీ ఎంపీటీసీ చంటి, కాడె నారాయణ, రావుల నారాయణ, రాజేశ్వర్ పాల్గొన్నారు.

సారంగాపూర్ : మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల చించోలి(బి)తో పాటు మండలంలోని సారంగాపూర్, సాయినగర్ బండ్రేవుతాండ, కుప్టి, జామ్, యాకర్‌పల్లి, స్వర్ణ ఉర్దూ మీడియం పాఠశాలల్లో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా డా.బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారత రాజ్యాంగం ఔన్నత్యాన్ని విశిష్టతను ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మధుసూధన్, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ, రమేష్, సుజాత, వాణి, సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాంసి : భారత రాజ్యాంగం దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం తాంసి, భీంపూర్ మండల కేంద్రాల్లోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాయాల్లో, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, రాజ్యాంగ ఆవశ్యకతను వివరించారు. ఆయన రచించిన రాజ్యాంగ వల్లనే ప్రతి ఒక్కరికి విద్యా, ఉద్యోగం రాజకీయాల్లో రిజర్వేషన్ల అమలతో అందరికీ సముచిత న్యాయం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు లక్ష్మి, నలంద ప్రియ, ఎంపీడీఓలు మోహన్‌రెడ్డి, గోపాలకృష్ణరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్, ఆయ కార్యాలయ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ముథోల్ : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో మంగళవారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసిన అనంతరం

విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా రాజ్యాంగ ప్రవేశికను చదివారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి : భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తి కావడంతో రాజ్యాంగ దినోత్సవాన్ని మండలంలో ఘనంగా జరుపుకున్నారు. స్థానిక విగ్రహం వద్ద దళిత సంఘాల ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకున్నారు. అనంతరం జెడ్పీ హైస్కూల్‌లో మండల విద్యాధికారి మాను, హెచ్ఎం ఆధ్వర్యంలో







రాజ్యాంగం రచన, అంబేద్కర్ చేసిన కృషిని గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డా.బీఆర్.అంబేద్కర్ మెమోరియల్ మండలాధ్యక్షులు సోస్ కాంబ్లే మనోహర్, ఈఓ సంజీవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శైలజ మృతికి కారకులైన వారిని శిక్షించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలానికి చెందిన శైలజ మృతికి కారకులైన వారిని శిక్షించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సిడం సాయికుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆశ్రమ బాలికల పాఠశాలలో 9వ తరగతి చదువుతూ గత 15 రోజుల కింద ఆ పాఠశాలలో ఫుడ్ పాయిజాన్ జరిగిందన్నారు. నిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందడం బాధకారమన్నారు. శైలజ కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని వారి కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగం ఒకరికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆమె కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ ప్రధాన కార్యదర్శి కొమర అశోక్, నాయకులు సుంగు హరీష్ పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక పాలనందిస్తున్న కేంద్ర ప్రభుత్వం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ పాలన సాగిస్తుందని ఆల్ ఇండియా కిసాన్ మహాసభ జిల్లా కార్యదర్శి చిలుక దేవిదాస్ అన్నారు. మంగళవారం కేంద్రం తీరుకు వ్యతిరేకంగా దేశ వ్యాప్త నిరసనల్లో భాగంగా వామపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో కిసాన్ చౌక్‌లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా కిసాన్ మహాసభ జిల్లా కార్యదర్శి చిలుక దేవిదాస్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ సర్కార్ కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తు వ్యతిరేక విదానాలను అవలంబిస్తుందన్నారు. మూడు నల్ల చట్టాలను రద్దు చేస్తామని లిఖితపూర్వకంగా ఇచ్చి కూడా దాన్ని మళ్లీ అమలు చేసేలా కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. కేంద్రం తీరుకు వ్యతిరేకంగా కార్మిక, రైతు, ప్రజా సంఘాలు ముందుకు వచ్చి పోరాడాలన్నారు. కార్యక్రమంలో దేవేందర్, రాజు, సంగెపు బొర్రన్న, వెంకటనారాయణ, నాయకులు ఉన్నారు.

జాబ్ కార్డు ఉన్న కూలీలకు ఉపాధి పనులు కల్పిస్తాం



నవతెలంగాణ-నార్నూర్

జాతీయ ఉపాధి హామీ చట్టంలో భాగంగా జాబ్ కార్డు ఉన్న కూలీలకు పనులు కల్పిస్తామని ఎంపీడీఓ జవహర్‌లాల్, ఏపీఓ జాదవ్ సురేష్ అన్నారు. మంగళవారం మండలంలోని తాడిహత్నూర్‌లో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు, ఉపాధి హామీ పనుల జాతరను మొదలు పెట్టారు. అదేవిధంగా ఎక్కువ పని దినాలు చేసిన కూలీలకు శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. పలు రకాల పనులను ప్రారంభించారు. ఇందులో ఈసీ సురేందర్, ఫీల్డ్ అసిస్టెంట్ మోతిలాల్ ఉన్నారు.

విద్యార్థులకు అల్పాహారం అందజేత

నవతెలంగాణ-కడెం

మండలంలోని లింగాపూర్ గ్రామంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయులుగా పని చేస్తున్న వాల్గొట్ కిషన్ మంగళవారం 10వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ సమయంలో 4.15 నుంచి 5.15 సాయంత్రం 80 మంది విద్యార్థులు అల్పాహారం, పండ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడారు. నిరుపేద విద్యార్థులకు తనకు తోచినంత సహాయం చేయడంలో వారికి ఆనందం ఉందని వారు అన్నారు.

అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని స్వీప్ నోడల్ అధికారి వెంకటేశ్వర్లు సూచించారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలో 2కే రన్ నిర్వహించారు. స్థానిక టీచర్స్ కాలనీ, దస్నాపూర్‌లో ర్యాలీ నిర్వహించి ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేర్లను ఫాం 6 ద్వారా నమోదు చేసుకోవాలని అన్నారు. ఆన్‌లైన్‌లో లేదా తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు ఫారాలను అందించవచ్చని తెలిపారు.

సీపీఐ(ఎం) జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఈ నెల 28, 29 తేదీల్లో ఆదిలాబాద్ పట్టణంలో జరిగే సీపీఐ(ఎం) పార్టీ జిల్లా 13వ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా నాయకులు ఆత్రం కిష్టన్న, ఉయిక విష్ణు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని పిప్రి గ్రామంలో మహాసభల పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ పోస్టర్లు విడుదల చేశారు.

తాంసి నూతన ఎస్సైగా రాధిక



నవతెలంగాణ-తాంసి

తాంసి పోలీస్‌స్టేషన్ నూతన ఎస్సైగా రాధిక మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన శివరాం బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో బేల పోలీస్ స్టేషన్ నుంచి తాంసి పోలీస్ స్టేషన్ బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన రాధికను బదిలీపై వెళ్తున్న శివరాంను పోలీస్ సిబ్బందితో పాటు మాజీ సర్పంచ్ కృష్ణ కాంగ్రెస్ నాయకుడు రామన్న యాదవ్, బీఆర్ఎస్ నాయకుడు కంది గోవర్ధన్‌రెడ్డి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రత దృష్ట్యా కఠినంగా వ్యవహరిస్తూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదు దారుల అందరితో స్నేహపూర్వకంగా ఉంటానని, పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని అన్నారు.

నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలి



నవతెలంగాణ-సారంగాపూర్

ప్రజాపాలన విజయోత్సవాల కార్యక్రమంలో ఉపాధి హామి చట్టం కింద చేపట్టిన పనులు నిర్ణిత సమయంలోనే పూర్తి చేయాలని డీపీఓ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని బిరవెల్లి గ్రామాల్లో ఎంపీడీఓ లక్ష్మీ కాంతారావుతో కలిసి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. రైతుల వ్యక్తిగత పనులు పశువుల పాక, గొర్రెల పాక, నర్సరీ, ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, రోడ్ల నిర్మాణం, పండ్ల తోటల పెంపు వంటి పనులను మార్చి 31లోగా పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ అజీజ్ ఖాన్, ఏపీఓ లక్ష్మారెడ్డి, ఏపీఎం మాధురి, టీఏ రోజ, పోశెట్టి పంచాయతీ కార్యదర్శులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు మస్కాపూర్ విద్యార్థులు

నవతెలంగాణ-ఖానాపూర్

రాష్ట్రస్థాయి వేయిట్ లిఫ్టింగ్ పోటీల్లో మస్కాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి 9 పతకాలను సాదించి, జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ఎం.శివసాయి గోల్డ్ మెడల్ సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కాగా, వివిధ విభాగాల్లో విద్యార్థులు రాజు, విష్ణు, గౌతం, రాహుల్, రిషించి, నిశిధవర్ధిని, సంహార, శ్రీనిధిలు వెండి పతకాలు సాదించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బోనగిరి నరేందర్‌రావు, తొంటి శంకర్, కుర్ర శేఖర్, జాడి శ్రీనివాస్, వెన్నం అంజయ్య వ్యాయామ ఉపాధ్యాయులు షేక్ ఇమ్రాన్, శోభారాణి, దీప్తి, షఫీ, ఫరాజ్, కిషన్ ప్రసాద్, విజయ్, రవి, చందన, లక్ష్మణ్ రావు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణానికి భూమిపూజ

- రూ.20లక్షల నిధులు మంజూరు



నవతెలంగాణ-జైనథ్

మండలంలోని హసీంపూర్ గ్రామంలో రూ.20లక్షల నిధులతో చేపట్టనున్న గ్రామపంచాయతి నూతన భవన నిర్మాణ పనులకు మార్కెట్ కమిటీ చైర్మెన్ అల్లూరి అశోక్ రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కంది శ్రీనివాస్‌రెడ్డి కృషితో నిధులు మంజూరైనట్టు తెలిపారు. ఇంటి స్థలం ఉన్న పేదలకు ఇల్లు కట్టుకోవడానికి త్వరలో రూ.5లక్షలు ఆర్థిక సాయం కూడా ప్రభుత్వం అందచేస్తుందన్నారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు అలాంటి వార్ల పేర్లు సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి నారాయణ స్వామి ఆలయ కమిటీ చైర్మెన్ అడ్డి రూకేష్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజన్న, నాయకులు గడ్డం జగదీష్‌రెడ్డి, ఎల్మ గంగా రెడ్డి, కుంట కిష్టారెడ్డి, బోనగిరి సంటెన్న, తరోడ లాస్మారెడ్డి, గ్రామ నాయకులు రఘురామ్‌తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉట్నూర్ : మండలంలోని కన్నాపూర్ గ్రామంలో రూ.20లక్షలతో నిర్మించనున్న నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి మంగళవారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ భూమిపూజ చేశారు. అనంతరం మొక్కని నాటారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు, రాజ్యాంగ దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం బోయవాడ కాలనీలో రూ.12లక్షలతో నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవనానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చకుండా ప్రజా విజయోత్సవాలు ఎలా..?

- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

నవతెలంగాణ-భైంసా

ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం గడిచిందంటూ ముఖ్యమంత్రి రేవంత్ ప్రజాపాలన పేరుతో ప్రజా విజయోత్సవాలు జరుపుకోవడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. మంగళవారం భైంసా మండలంలోని వటోలి గ్రామంలో నిర్వహించిన ప్రజా విజయోత్సవ కార్యక్రమాల్లో పాల్గొని ఆయన మాట్లాడారు. రూ.2లక్షల నిధులతో నిర్మించనున్న పాఠశాల మరుగుదొడ్లు, రెండు లక్షల గ్రామీణ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. గ్రామాల్లో సమస్యలు రాజ్యమేలుతుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రజా విజయోత్సవంలో పాల్గొని ప్రభుత్వాన్ని విమర్శించే ఆలోచన లేనప్పటికీ ప్రజా సమస్యలు చూస్తుంటే తప్పదనిపిస్తుందన్నారు. రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రజలు వేచి చూస్తున్నారని ప్రభుత్వం తక్షణమే నిధులుకేటాయించాలని డిమాండ్ చేశారు. రైతులకు రైతు భరోసా ఇవ్వకపోవడం ఏంటన్నారు. గత ప్రభుత్వం ఆస్తుల్ని తనఖా పెట్టి రైతులకు న్యాయం చేసిందన్నారు. సంవత్సర కాలంలో ఒకేసారి రైతు భరోసా వచ్చిందని, ఒకేవేళ 35శాతం రైతులకు మాత్రమే రుణమాఫీ వచ్చిందని, మిగతా 65శాతం రైతులు రుణమాఫీ అందక అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారన్నారు. తక్షణమే రుణమాఫీ చేయాల్సిందిగా డిమాండ్ చేశారు. ఉపాధిహామీ నిధులైనా కేంద్ర ప్రభుత్వనిధులతో విజయోత్సవాలు



జరుపుకోవడం ఏంటన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులను తమ నిధులు అంటూ కాంగ్రెస్ నాయకులు చెప్పుకుంటున్నారన్నారు. మహారాష్ట్రలో ఏక్ నాథ్ షిండే ప్రభుత్వం లాడ్ లి బహన్ పేరుతో ప్రతి ఆడపరచుకు నెలకు రూ.1500 ఇస్తుందన్నారు. మహాలక్ష్మి పథకం మహిళలకు ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. హామీలను నెరవేర్చి విజయోత్సవాలు జరుపుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు తాజా మాజీ సర్పంచ్ సచిన్ పలు సమస్యలను విన్నవించడంతో, దశలవారీగా గ్రామ సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యేకు అధికారులు, గ్రామస్తులు స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు.

కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, ఎంపీఓ మొజామ్, ఉపాధి హామీ ఏపీఓ శివలింగయ్య, మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, నాయకులు సోలంకే భీంరావు, సీనియర్ అడ్వకేట్ గంగాధర్, మహిళా మోర్చ నాయకురాలు సిరం సుష్మారెడ్డి, నాయకులు తాలోడ్ శ్రీనివాస్, అశోక్, సుభాష్, గంగప్రసాద్, భూమేష్, రాజేశ్వర్, రాజారెడ్డి, సాయరెడ్డి, బండారి అశోక్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

3

కుమురంభీం ఆసిఫాబాద్

బుధవారం | నవంబర్ 27, 2024 | www.navatelangana.com

భీమన్న మైదానాన్ని పరిశీలించిన జీఎం

నవతెలంగాణ-రెబ్బెన



బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి శ్రీ భీమన్న క్రీడా మైదానాన్ని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ పరిశీలించారు. డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ 91వ వార్షిక క్రీడా పోటీలలో భాగంగా మైదానంలో నిర్మిస్తున్న క్రికెట్ పిచ్ పనులను తనిఖీ చేశారు. డిసెంబర్‌లో కంపనీ స్థాయి క్రికెట్ పోటీల కోసం ఏర్పాట్ల వివరాలను తెలుసుకున్నారు. మరోవైపు చిన్నారుల కోసం ఏర్పాటు చేస్తున్న మినీ పార్క్ పరికరాలను పరిశీలించారు. రాత్రి కూడా క్రీడాకారులు సాధన చేసేందుకు లైట్లు, సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం కె.రాజమల్లు ,ఏరియా ఇంజినీర్ భీంరావ్ జాడే, సివిల్ (ఎస్ఈ) మదీనా బాషా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కిరణ్ పాల్గొన్నారు.

భార్య చేతిలో భర్త హతం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

మద్యం తాగి వచ్చిన భర్తతో గొడవపడ్డ భార్య క్షణికావేశంలో భర్త తలపై క్రికెట్ బ్యాట్‌తో బాదడంతో భర్త అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన కాగజ్‌నగర్ మండలం నజ్రుల్‌నగర్ నెం.2లో జరిగింది. మృతుని తల్లి, పోలీసులు తెలిపిన ప్రకారం నజ్రుల్‌నగర్ నెం.2లో నివాసముంటున్న దులాల్ సర్కార్ (44) సరస్వతి సర్కార్‌లు భార్య భర్తలు. దులాల్ సర్కార్ కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్య భర్తల మధ్య తరచుగా గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం మధ్యాహ్నం మద్యం తాగి వచ్చిన దులాల్ సర్కార్‌కు భార్య సరస్వతి సర్కార్‌కు మధ్య గొడవ జరిగింది. క్షణికావేశంలో భార్య సర్వసతి సర్కార్ ఇంట్లో ఉన్న క్రికెట్ బ్యాట్‌తో భర్త తలపై మోదడంతో తలపై బలమైన గాయం తగిలి దులాల్ సర్కార్ అక్కడికక్కడే మృతి చెందాడు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉండగా, కూతురు వివాహం జరిగింది. సంఘటనా స్థలాన్ని రూరల్ సీఐ శ్రీనివాస్‌రావు, కాగజ్‌నగర్ రూరల్, ఈజ్‌గాం ఎస్‌ఐలు సందీప్‌కుమార్, మహేందర్‌లు సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. మృతుని తల్లి కమలా సర్కార్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములు చేయాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-కాగజ్‌నగర్

గ్రామాల అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములు చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే సూచించారు. మంగళవారం కాగజ్‌నగర్ మండలం అంకుసాపూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి ఆయన పనులను శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో గ్రామాల అభివృద్ధికి భారీగా నిధులు విడుదల చేయడం జరుగుతోందన్నారు. జిల్లాలో 80 అంగన్‌వాడీ కేంద్రాలు, 30 పంచాయతీ భవన నిర్మాణ పనులకు ఉపాధి హామీ కింద రూ. 37 కోట్లను మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందిరా మహిళా శక్తి, ఉపాధి భరోసా, ఉద్యానవన, వన మహోత్సవం, జల నిధి, గ్రామీణ మౌళిక సదుపాయాల కల్పన కింద నిధులు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు, ప్రజా సంక్షేమ అభివృద్ధి పథకాలపై చేపట్టనున్న ప్రజా పాలన విజయోత్సవాలను జిల్లాలో విజయవంతం చేయాలని సూచించారు. సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులైన ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా గ్రామాలలో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలు, సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణం తదితర పనులన్నింటికి కేంద్ర ప్రభుత్వమే నిధులు విడుదల చేస్తోందని అన్నారు. టైగర్ కారిడార్ పేరిట అంకుసాపూర్ రైతులను అటవీ అధికారులు తరచుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాం, శాఖల అధికారులు పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన తహసీల్దార్

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని బాబాపూర్ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలను తహసీల్దార్ మునవర్ షరీఫ్ మంగళవారం సందర్శించారు. పాఠశాల భోజనాశాలను తనఖీ చేసి విద్యార్థులతో కలసి భోజనం చేశారు. అనంతరం పాఠశాలలోని పలు సమస్యలను హెచ్ఎం అశోక్ తహసీల్దార్‌కు విన్నవించారు. మరుగుదొడ్లు, నీళ్ల పైప్ కనెక్షన్ చెడిపోయి, వేడి నీళ్ల కులాయి మిషన్ పాడైపోయి పనిచేయడం లేదని, సీలింగ్ ఫ్యాన్లు కూడా పనిచేయడం లేదని ఆయన దృష్టికి తీసుకువచ్చారు.

శిక్షకుల నుండి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి, మాదారం టౌన్‌షిప్‌లో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహించనున్న బ్యుటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, డీటీపీ, స్పోకెన్ ఇంగ్లీష్, యోగా కోర్సులు నేర్పించేందుకు శిక్షకుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు డిసెంబర్ 2సాయంత్రం 5 గంటలలోపు గోలేటిలోని జీఎం కార్యాలయం పర్సనల్ డిపార్ట్‌మెంట్‌లో సేవా సమితి కో ఆర్డినేటర్‌కు దరఖాస్తులు అందజేయాలన్నారు. వివరాలకు సెల్ నెంబర్ 9951214116 సంప్రదించాలన్నారు.

అశ్రునయనాల మధ్య శైలజ అంత్యక్రియలు

- నియోజకవర్గంలో పోలీసుల ఆంక్షలు
- అర్ధరాత్రి ఎమ్మెల్యే గృహ నిర్బంధం



ఆసిఫాబాద్ : బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దండె విఠల్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కలుషిత ఆహారం తిని తీవ్ర అస్వస్థతతో చికిత్స పొందుతూ మృతి చెందిన విద్యార్థిని శైలజ అంత్యక్రియలు మంగళవారం వాంకిడి మండలం దాబాలో అశ్రునయనాల మధ్య జరిగాయి. అంత్యక్రియలకు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్, ఆసిఫాబాద్, సిర్పూర్ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, పాల్వాయి హరీష్‌బాబు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు పోచయ్యతో పాటు మాలీ సంఘం నాయకులు తరలి వెళ్లారు.

పోలీసుల ఆంక్షలు

రెండు నెలల క్రితం జైనూర్‌లో జరిగిన అల్లర్ల నేపథ్యంలో ప్రస్తుతం వాంకిడి సంఘటనకు కూడా జరిగే అవకాశముందని ఇంటలిజెన్స్ వర్గాల హెచ్చరికల నేపథ్యంలో పోలీసులు ఎక్కడికక్కడ ఆంక్షలు విధించారు. దాబా గ్రామానికి మీడియాతో పాటు బయట వ్యక్తులు ఎవరిని కూడా అనుమతించలేదు. ఎస్పీ డివి శ్రీనివాసరావుతో పాటు, ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం పరిస్థితిని దగ్గరుండి పర్యవేక్షించారు.

అర్ధరాత్రి ఎమ్మెల్యే గృహనిర్బంధం

శైలజ మృతదేహాన్ని హైదరాబాద్ నుండి స్వగ్రామానికి తరలిస్తున్న క్రమంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి పరామర్శకు వెళుతుందనే సమాచారం నేపథ్యంలో సోమవారం రాత్రి ఆమెను ఇంట్లోనే దిగ్బంధించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినికి న్యాయం చేసే వరకు పోరాటం చేస్తామని తెలిపారు. పోలీసులు అడ్డుకుంటే ఆగే ప్రసక్తి లేదని హెచ్చరించారు. రాత్రి హైటెన్షన్ కొనసాగగా మంగళవారం ఉదయం ఆమెను దాబాకు అనుమతించారు. బీఆర్ఎస్ నాయకులను కూడా నియోజకవర్గంలో ఎక్కడికక్కడ సోమవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. రెబ్బెన మండలానికి చెందిన నాయకులను కాగజ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

మాలి సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో

కెరమెరి :

వాంకిడి ఆశ్రమ పాఠశాల ఫుడ్ పాయిజన్ చౌదరి శైలజ తొమ్మిదో తరగతి విద్యార్థిని హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందడంతో మాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. మాజీ ఎంపిపీ పెందూర్ మోతీరాం, మాజీ జడ్పీటీసీ సెడ్మకి ద్రుపత బాయి, బీజేపీ నాయకులు ఉత్తం నాయక్ మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాంకిడి ఆశ్రమ పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా చౌదరి బాలిక మృతి చెందిందన్నారు. వసతి గృహాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతోనే బాలిక మృతి చెందింది ఆరోపించారు. ప్రభుత్వం బాలిక కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్ గ్రేషియాతో పాటు కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. మాలీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు కావుడే తులసిరాం, డివిజన్ ప్రధాన కార్యదర్శి లెన్గురే బాలాజీ, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మనవి భారత భూషణ్, మాజీ సర్పంచులు తొడసం జగన్నాథ్ రావు, నాయకులు కొట్రాంగే తిరుపతి, వాడై సుభాష్, వాడై దేవిందర్ పాల్గొన్నారు.

బాలిక ఆత్మకు నివాళి

వాంకిడి ఆశ్రమ పాఠశాలలో అస్వస్థతకు గత గురై హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విద్యార్థిని చౌదరి శైలజ ఆత్మకు శాంతి చేకూరాలని గోయాగంలో క్యాండిల్ వెలిగించి నివాళులర్పించారు. గ్రామంలోని యువకులు బాలిక చిత్రం పటం వద్ద మౌనం పాటించి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కార్యక్రమంలో గ్రామ యువకులు మొహర్లే సుధాకర్, అజయ్, లక్ష్మణ్, రాందాస్, గోపాల్, నాగార్జున్ పాల్గొన్నారు.

శైలజది ముమ్మాటికి ప్రభుత్వ హత్యే

కాగజ్‌నగర్ :

వాంకిడి ఆశ్రమ పాఠశాల విద్యార్థిని శైలజ మృతి ముమ్మాటికి ప్రభుత్వ హత్యేనని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వసాకె సాయికుమార్ ఆరోపించారు. మంగళవారం కాగజ్‌నగర్ పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ జిల్లాలో సంక్షేమవసతి గృహాలు దయనీయ స్థితిలో కొనసాగుతున్నాయని, దీనికి అధికారుల పర్యవేక్షణ లోపమే కారణమని అన్నారు. వాంకిడి ఘటన జరిగి నెల రోజులు కావస్తున్నా ఇప్పటి వరకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. శైలజకు కార్పోరేట్ వైద్యం అందిస్తే ప్రాణాలు కోల్పోయేది కాదని, ఈ విషయంలో శైలజకు మంచి వైద్యం అందించాలని ఎస్ఎఫ్ఐ మొదటి నుండి డిమాండ్ చేసినా పట్టించుకోలేదన్నారు. శైలజ మృతి పట్ల అధికారుల, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ బుధవారం జిల్లా వ్యాప్తంగా అన్ని విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కార్తీక్, రాకేష్, నరసింహ, కార్తీక్, శ్రావణ్, శంకరయ్య, తిరుపతి పాల్గొన్నారు.



కాగజ్‌నగర్ : నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

తిర్యాణి : వాంకిడి హాస్టల్లో కలుషిత ఆహారాన్ని తీసుకొని హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొంది మృతి చెందిన విద్యార్థినీ శైలజ కుటుంబానికి న్యాయం చేయాలని మండలంలోని కుమురం భీం చౌరస్తాలో ఆదివాసీ సంఘాల నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా తుడుం దెబ్బ ఉపాధ్యక్షులు వెడ్మ భగవంతు రావు మాట్లాడుతూ ఈ సంఘటనకు బాధితులుగా గిరిజన శాఖ అధికారులైన ఏటీడీఓ, డీటీడీఓ, ఐటీడీఏ పీఓలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బియ్యం, పప్పులు, కుళ్ళిన కోడిగుడ్లు, కాలం చెల్లిన వంట సామాగ్రి విద్యార్థుల ప్రాణాలను తీస్తున్నారని మండిపడ్డారు. ఇకనైనా సంక్షేమ హాస్టళ్లకు వంట సామగ్రిని అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు



కెరమెరి : శైలజకు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న గోయగాం యువకులు

ఎక్స్‌రే ప్లాంట్ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-రెబ్బెన



గోలేటిలోనీ పీరియాడికల్ మెడికల్ ఎగ్జామినేషన్ సెంటర్‌లో ఆరు నెలలుగా ఎక్స్ రే ప్లాంటు పనిచేయడం లేదని వెంటనే ఏర్పాటు చేయాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం బెల్లంపల్లి ఏరియా కార్యదర్శి మారిన వెంకటేష్ డిమాండ్ చేశారు. మంగళవారం గోలేటిలోని పీఎంఈ సెంటర్ వద్ద ఆయన టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మల్‌రాజ్ శ్రీనివాసరావుతో కలిసి మాట్లాడుతూ టీబీజీకేఎస్ డిమాండ్ మేరకు రెండు సంవత్సరాల క్రితం కార్మికులకు మెడికల్ టెస్టులు నిర్వహించే సెంటర్‌ను గోలేటిలో ప్రారంభించారన్నారు. కానీ ఆరు నెలలుగా ఎక్స్ రే మిషన్ పనిచేయకపోవడం, వినికిడి టెస్టింగ్ మిషన్ లేకపోవడం వలన కార్మికులను అంబులెన్స్‌లో బెల్లంపల్లికి తీసుకెళ్లి అక్కడ టెస్ట్ చేయించుకొని తీసుకొస్తున్నారని తెలిపారు. దీనివలన ఉదయం టిఫిన్ చేయకుండా వచ్చిన కార్మికుడు సాయంత్రం 6 గంటల వరకు హాస్పిటల్లోనే ఉండాల్సి వస్తుందని, కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎక్స్ రే, ఆడియో మిషిన్, మంచినీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ నాయకులు ఓరం కిరణ్, మాంతు సమ్మయ్య, ఏరియా నాయకులు అనుమాండ్ల, సత్యనారాయణ, ఖైరిగూడ అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి మారిన చందర్ పాల్గొన్నారు.

పశుఆస్పత్రిని తనిఖీ చేసిన జిల్లా పశువైద్యాధికారి

నవతెలంగాణ-సిర్పూర్(టి)



మండల కేంద్రంలోని పశు ఆస్పత్రిని జిల్లా పశువైద్యాధికారి సురేష్ కుమార్ తనిఖీ చేశారు. అనంతరం మండలంలోని లోనవెల్లి గ్రామంలో పశు సంవర్ధక శాఖ పశుగణాభివృద్ధి సంస్థ ద్వారా పెర్టిలైటి క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో ఆవులు, గేదెలకు పరీక్షలు చేశారు. గర్భకోశ వ్యాధి ఉన్న వాటికీ చికిత్స అందించారు. ఈ క్యాంపులో ఆవులు 109, గేదెలు 35, లెగాడుదాలు 18, ఎద్దులు 56, మేకలు 29 మొత్తం 247 పశువులకు చికిత్స చేశామని జిల్లా పశు వైద్యాధికారి తెలిపారు. అదేవిదంగా రైతులకు పశువైద్యాధికారి డాక్టర్ భవిత కృత్రిమ గర్భధారణ ద్వారా ఆడ దూడలు మాత్రమే పుడుతాయని రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గోపాల మిత్ర సూపర్‌వైజర్ చిపెల్లి రమేష్, చిపెల్లి భాస్కర్, ఎమూర్ల, రాజేశ్వర్, డోంగ్రే ప్రకాష్, జూండి, నాందేవ్ పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాజ్యాంగ కమిటీ చైర్మన్ అంబేద్కర్ ఆధ్వర్యంలో రచించిన భారత రాజ్యాంగం ఆమోదం పొందిన రోజును పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు వివిధ సంఘాలు, విద్యాసంస్థలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బ్రిటిష్ కబంధహస్తాల నుండి స్వేచ్ఛ వాయువులు పీల్చుకోవడంతో పాటు అన్ని వర్గాల సంక్షేమం కోసం, సమసమాజ స్థాపన కోసం రాజ్యాంగం తోడ్పడిందని గుర్తు చేశారు.

బీజేపీ కార్యాలయంలో..

బీజేపీ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కొత్తపెల్లి శ్రీనివాస్ అధ్యక్షతన వేడుకలు నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలామలాలు వేసి సేవలను స్మరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్లికార్జున్, జిల్లా ఉపాధ్యక్షుడు విశాల్, జిల్లా ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మాటూరి జయరాజ్, మాజీ వైస్ ఎంపీపీ మంగ పెంటయ్య పాల్గొన్నారు.

బీసీ సంఘం ఆధ్వర్యంలో

బీసీ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో నిర్వహించిన వేడుకల్లో జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేష్, రైతు సంఘం అధ్యక్షుడు మారుతి పటేల్, జిల్లా ప్రధాన కార్యదర్శి గాజుల జక్కయ్య నాయకులు మిట్ట తిరుపతి, శంకర్, మారుతి పాల్గొన్నారు.

జనకాపూర్ పాఠశాలలో

పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో ప్రధానోపాధ్యాయుడు ఉదయబాబుతో పాటు ఉపాధ్యాయులు రాజశేఖర్, విజేశ్, సుభాష్ పాల్గొన్నారు.

ఎంఎం హెల్ప్ లైన్ ఆధ్వర్యంలో

జిల్లా కేంద్రంలోని ఎంఎం హెల్ప్ లైన్ ఫౌండేషన్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఫౌండేషన్ అధ్యక్షుడు ఎండి అహ్మద్, సభ్యులు జాకీర్ హుస్సేన్, పవన్, మన్సూర్ , ముజాహిద్, గౌస్ ఖాన్, షఫీ, సమీర్ ఖాన్, మతిన్ పాల్గొన్నారు.

గుండి గ్రామంలో..

మండలంలోని గుండి గ్రామంలో నిర్వహించిన వేడుకల్లో మాజీ సర్పంచ్ దత్తు, గుండి ప్రత్యేక అధికారి శ్యామ్‌లాల్, కారోబార్ పాలే వినోద్, పంచాయతీ కార్యదర్శి హరీష్, కాంగ్రెస్ నాయకులు బట్టుపెల్లి రమేష్ చారి, కమలాకర్, సంతోష్, భీంరావు, విశ్వనాథ్, రాజు గురుమూర్తి గ్రామస్తులు పాపయ్య, నానాజీ పాల్గొన్నారు.

పీటీజీ కళాశాలలో

పీటీజీ కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఓంకార్ కృష్ణ ఉపాధ్యాయులు సిబ్బందితో కలిసి అంబేద్కర్‌కు నివాళులర్పించారు.

కాగజ్‌నగర్ : కాగజ్‌నగర్ పట్టణంతో పాటు మండలంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని చారిగాం ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవానికి ఎంపీడీఓ రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు రాజ్యాంగం, అంబేద్కర్ సేవలపై చేసిన నృత్యాలు పలువురిని ఆలోచింపచేశాయి. ఎంపీడీఓ మాట్లాడుతూ దేశంలో భిన్న మతాలు, కులాలు ఉన్నా అందరూ సమానమేనని, లింగ వివక్షత లేని సమసమాజ స్థాపన కోసం డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కృషి చేశారన్నారు. మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ మాట్లాడుతూ రాజ్యాంగంలో ఓటు హక్కు కల్పించి బానిస సంకెళ్లను తెంచిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన కార్యక్రమ సమన్వయ కర్త, పాఠశాల ఉపాధ్యాయుడు సుందిళ్ల రమేష్‌ను పలువురు అభినందించారు. కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ కో ఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం ఆత్రం ప్రమీల, పాఠశాల హెచ్ఎం తాళ్లూరి ప్రభుదాస్, ఎపీసీ చైర్‌పర్సన్ కవిత, కార్యదర్శి ముర్మ స్వప్న, ఎపీఎం భూమక్క, స్వచ్ఛంద సేవకులు వడై పావని పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ కార్యాలయంలో..

సీనియర్ సిటిజన్ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ మాట్లాడుతూ భారత దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన పవిత్ర గ్రంథం మన రాజ్యాంగమన్నారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, మూర్తి, పురుషోత్తం, రమణయ్య, బావండ్లపల్లి నర్సయ్య, కోటేశ్వర్, నాగేశ్వర్‌రావు, చిలుక లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

వాంకిడి :

భారతదేశంలో ఉన్న అన్ని గ్రంథాలకన్న భాతర రాజ్యాంగమే గొప్పదని భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు మహెల్కార్ అశోక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధవిహార్‌లో నిర్వహించిన 75వ రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. మండలకేంద్రంలోని జెట్వాన్ బుద్ధవిహార్ ప్రాంగణంలో 75వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలను భారతీయ బోధన సభ జిల్లా బౌద్ధ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో బౌద్ధ ఉపాసకులు ఝాడే పాండుజీ, సమాజ్ అధ్యక్షుడు కోబ్రాగడే విలాస్, రాజేంద్రప్రసాద్, భారతీయ బోధన సభ జిల్లా బౌద్ధ సంఘం నాయకులు విక్రు, హంసరాజ్, దుర్గం శ్యామ్‌రావు, రాజేశ్వర్, దేవాజీ, రోషన్, ఒమాజీ, అంబేద్కర్ సంగం నాయకులు దుర్గం అజయ్, ప్రతాప్ పాల్గొన్నారు.

బెజ్జూర్ : మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవం మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని మహాత్మా గాంధీ ఉపాధి హామీలో మంజూరు చేసిన రూ.లక్ష నిధులతో బెజ్జూర్‌కు చెందిన తొర్రెం విమల పశువుల షెడ్ నిర్మాణాలకు భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గౌరీ శంకర్, ఏపీఓ ఎగిరి రాజన్న, ఏపీఎం మోహన్లాల్, గ్రామ కార్యదర్శి తుకారం, జిల్లా ఐకెపి అధ్యక్షురాలు శ్రీదేవి, సీసీలు భద్రయ్య, పద్మ, ఫీల్డ్ అసిస్టెంట్ రవి కుమార్, బెజ్జూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీవర్ధన్, యూత్ అధ్యక్షులు హకీమ్, నాయకులు జావిద్ అలీ, సామల తిరుపతి పాల్గొన్నారు.

చింతలమానేపల్లి : మండల కేంద్రంలో 75వ భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను బౌద్ధ మహాసభ తాలూకా అధ్యక్షులు బసర్కార్ విశ్వనాథ్, సమాత సైనిక దళ్ జిల్లా అధ్యక్షులు జాడి దిలీప్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కుమురం భీం చౌరస్తా నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీగా వచ్చి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేయడంతో పాటు ప్రతి పౌరుడు భారతీయ రాజ్యాంగం తెలుసుకోవాలని ఉద్దేశంతో విద్యార్థులకు భారత రాజ్యాంగం విశ్లేషణ పుస్తకాలను అందించారు. ఇందులో గ్రామ కార్యదర్శి ఆసిఫ్ అలీ, దుబ్బుల వెంకన్న, బండురావు, అంబేద్కర్ వాదులు, ఉపాధ్యాయులు, అంబేద్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో మండల ప్రత్యేక అధికారి ప్రభాకర్ ఆధ్వర్యంలో గ్రామసభలు, ఉపాధి హామీ కొత్త పనులను ప్రారంభించారు. మండలంలోని గ్రామాల్లో గ్రామీణ ఉపాధి హామీ వంద రోజులు పని చేసిన కూలీలకు వన సేవకు, మల్టీపర్పస్ వర్కర్లను ఆయా గ్రామ పంచాయతీల కార్యాలయాల్లో సన్మానించారు. అమృత్ సరోవర్ చెరువుల వద్ద రాజ్యాంగ దినోత్సవం ప్రతిజ్ఞను సంబంధిత అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ అల్బర్ట్, ఇరిగేషన్ డీఈ భద్రయ్య, ఏపీఓ సతీష్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.







గోండుగూడలో సికిల్‌సెల్ వైద్య శిబిరం

నవతెలంగాణ-కెరమెరి



పీఎంజేఎస్ఎం పథకంలో భాగంగా మంగళవారం మండలంలోని గోండుగూడలో మంగళవారం సికెల్ సెల్ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తుల రక్త నమూనలను సేకరించారు. గిరిజన గ్రామాల్లో సికెల్ సెల్ వ్యాధి తీవ్రతను గుర్తించి చికిత్స అందించనున్నట్టు వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అక్షయ్, ఆస్పత్రి సిబ్బంది తిరుమల, శాంతాబాయి పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై సమావేశం

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామపంచాయతీ ఎన్నికలు ముసాయిదా ఓటర్లల జాబితాను మండలంలోని రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీఓ ఆల్బర్ట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీలో వార్డుల వారీగా తయారు చేసిన అనుబంధ ఓటర్ల జాబితాపై వారికి వివరించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి ప్రభాకర్, రాజకీయ నాయకులు బోయిరే బండన్న, బిట్టు శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షా శిబిరానికి స్పందన

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని కిమ్స్ ఆస్పత్రిలో శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి పరీక్షా శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ శిబిరానికి 28 మంది హాజరు కాగా ఇందులో 18 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరికి బెల్లంపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ తెలిపారు. ప్రతి మంగళవారం నిర్వహించే ఈ ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఓటరు లిస్టు తుది జాబితా వెల్లడి

నవతెలంగాణ-జైపూర్



గ్రామ పంచాయతీలలో వార్డుల వారిగా రూపొందించిన ఓటరు లిస్టు తుది జాబితాను ఎంపీడీఓ సత్యనారాయణ వెల్లడించారు. అభ్యంతరాలుంటే తెలియజేయాలన్నారు. మంగళవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో మండల పరిషత్ కార్యాలయంలో సమావేశమైన ఆయన మండలానికి సంబంధించిన ఓటరు లిస్టు తుది జాబితా ఈ నెల 28న జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ద్వార ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందని తెలిపారు. ఓటరు లిస్టులో పేరు నమోదు నిరంతరాయంగా కొనసాగుతున్న ఇప్పటి వరకు తయారు చేసిన ఓటరు లిస్టు తుది జాబితా ద్వార ప్రతక్ష్యంగా నిర్వహించనున్న ఎన్నికల్లో ప్రామానికంగా తీసుకుంటారన్నారు.

రాజ్యాంగాన్ని వ్యతిరేకించేవారు దేశద్రోహులు

నవతెలంగాణ-మంచిర్యాల



దేశంలో బడుగు బలహీన వర్గాల హక్కులు నిలబడాలంటే రాజ్యాంగమే ఏకైక ఆయుధమని బీసీ ఐక్యవేదిక నాయకులు పేర్కొన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బీసీ భవన్‌లో జరిగిన రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో బీసీ ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ వడ్డేపల్లి మనోహర్, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, జిల్లా నాయకులు కనుకుంట్ల మల్లయ్య, పిట్టల రవీందర్, పెద్దొల్ల చంద్రకాంత్, నస్పూరి అఖిల్ పాల్గొన్నారు.

రాజ్యాంగ రక్షణ అందరి బాధ్యత



నవతెలంగాణ-మంచిర్యాల

సమాజంలోని అన్ని వర్గాల ప్రజల హక్కులు నిలబడాలంటే రాజ్యాంగం ద్రుఢంగా ఉండాలని సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం అన్నారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంచిర్యాలలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. 1949లో ఇదే రోజున అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మన రాజ్యాంగ సభ ఆమోదించిందని, రాజ్యాంగం లేని రోజుల్లో ఆధిపత్య వర్గాల జులుం నడిచిందని, బలహీన వర్గాలకు హక్కులు లేకుండా పోయాయని తెలియజేశారు. రాజ్యాంగాన్ని బలహీనపరచాలని స్వార్థపరశక్తులు నేటికీ కుట్రలు పన్నుతున్నాయని అన్నారు. ఈ కుట్రలను అడ్డుకునే దిశలో దేశ ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఈదునూరి అభినవ్, గర్ల్స్ కోకన్వీనర్ ఆకాంక్ష, నస్పూర్ మండల ఉపాధ్యక్షులు ఈ. వెంకటేష్, బెల్లంపల్లి పట్టణ నాయకులు రాంచరణ్ పాల్గొన్నారు.

నివాళులర్పించిన నేతకాని సంక్షేమ సంఘం

భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి నేతకాని మహర్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సునర్కర్ రాంబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షుడు అనపర్తి యువరాజ్, నేతకాని స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జుమ్మిడి గోపాల్, జిల్లా అధికార ప్రతినిధి కొండగొర్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బేడ్డల లక్ష్మీనారాయణ, లక్ష్మణ్, సికిందర్, దుర్గయ్య పాల్గొన్నారు.

జైపూర్ : జైపూర్ సింగరేణి విద్యుత్ ప్లాంట్‌లో 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జీఎం పీసీఎస్ శ్రీనివాసులు, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఠాకూర్ మోహన్ సింగ్ రాజ్యాంగ ప్రవేశిక స్వారూప్యాన్ని అక్కడి వారి చేత పఠనం చేయించారు. ఈ సందర్భంగా బీఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం భారత దేశానికి దిక్సూచిగా నిలిచిందన్నారు.

లక్షెట్టిపేట : అన్ని వర్గాల అభ్యున్నతికే రాజ్యాంగం ఉందని దాని రక్షణకు ప్రతి ఒక్కరు పాటు పడాలని అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షులు తొగరు రాజు అన్నారు. మంగళవారం పట్టణంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో రాజ్యాంగం ఆమోదం పొందిన రోజును పురస్కరించుకొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పట్టణంలో అంబేద్కర్ విజ్ఞాన మందిరం నుండి డీజేతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దమ్మ నారాయణ, నాయకులు చిప్పకుర్తి నారాయణ, ప్రధాన కార్యదర్శి అల్లంపల్లి రమేష్ , మండల ఉపాధ్యక్షుడు బైరం లింగన్న, తొగరి కాంతన్న, దొంత నరసయ్య, పెండెం సత్తయ్య, పెరుగు తిరుపతి, బైరం రవి, మినుముల జనార్ధన్, పెండం రాజు, కుమార్, నవీన్, అంబేద్కర్ అభిమానులు పాల్గొన్నారు.

జన్నారం : భారత రాజ్యాంగం అందరికీ ఆదర్శమైందని మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు సిటీమల భరత్ కుమార్ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బోర్లకుంట ప్రభుదాస్, మున్వర్ అలీ ఖాన్, ముజాఫర్ అలీఖాన్, మహమ్మద్ రియాజుద్దీన్, మామిడిపల్లి ఇందయ్య, దుమల రమేష్, డాక్టర్ బెంజిమెన్, జీఎస్ నారాయణ, కోడూరు చంద్రయ్య పాల్గొన్నారు.

కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఆధ్వర్యంలో..

మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థుల ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా 100 మీటర్ల జాతీయ జెండాతో ఆ పాఠశాల నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



దండేపల్లి : భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మండలంలోని వివిధ కుల సంఘాలు, రాజకీయ పార్టీలు ఘనంగా నిర్వహించారు. ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ కళాశాలలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శోభ, ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం సంఘం మండల అధ్యక్షుడు కొల్లూరి రవి, విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకుడు రాంప్రసాద్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆరేపల్లి రమేష్, అంబేద్కర్ సంఘం నాయకులు దూట సాయికుమార్, ప్రశాంత్, వినయ్, అంజి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఓరియంట్ కంపెనీ పనుల అడ్డగింత



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని రొట్టెపల్లి ఏజెన్సీ గ్రామ పంచాయతీలో గుట్ట ప్రాంతంలో ఓరియంట్ సిమెంట్ కంపెనీ సిబ్బంది వేస్తున్న హద్దు రాళ్ల పనులను ఆదివాసీ సంఘాల నాయకులు అడ్డుకున్నారు. ఎలాంటి అనుమతులు, పీసా గ్రామ సభ లేకుండా రొట్టెపల్లిలోని గుట్ట ప్రాంతాన్ని అటవీశాఖకు అప్పగించడాన్ని ఆదివాసులు వ్యతిరేకించారు. దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ యాజమాన్యం దొంగ చాటున హద్దు రాళ్లను ఏర్పాటు చేయడంపై మండిపడ్డారు. ఓరియంట్ కంపెనీకి సంబంధించి సున్నపు రాయి లీజు పొడిగింపులో ఫారెస్ట్ భూమి పోతుండడంతో ఫారెస్ట్‌కు రొట్టెపల్లి ప్రాంతంలో రెవెన్యూ, మైనింగ్ ఆధ్వర్యంలో ఓరియంట్ సిమెంట్ ద్వారా అటవీ శాఖకు అప్పగించేందుకు చర్యలు చేపట్టారు. దీంట్లో భాగంగా గతంలో పనులు అడ్డుకోగా నిలిపి వేశారు. ప్రస్తుతం మళ్లీ హద్దు రాళ్లను ఏర్పాటు చేసే క్రమంలో ఆదివాసులు అడ్డుకున్నారు. గ్రామ సభ ఏర్పాటు చేసి ఆమోదం పొందాకే పనులు చేపట్టాలని, అప్పటి వరకు పనులు చేపట్టరాదని కుమురం భీం యువజన సంఘం ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. కార్యక్రమంలో కుముఠం భీం యువజన సంఘం అధ్యక్షుడు పెంద్రం హన్మంతు, కోవ వినోద్, చిక్రం రాందాస్, సిడం తిరుపతి, చిక్రం లింగారావ్ పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు టాంపరింగ్ చేయబడవు

నవతెలంగాణ-నస్పూర్

భారత ఎన్నికలలో ఓడిపోయినప్పుడు మాత్రమే ఈవీఎం విశ్వసనీయతను ప్రశ్నించడం సరికాదని, ఎన్నికలలో వినియోగించే ఈవీఎంలు టాంపరింగ్ చేయబడవని దేశ అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. భారత ఎన్నికలలో పేపర్ బ్యాలెట్ విధానాన్ని మళ్ళీ ప్రవేశపెట్టాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు ధర్మాసనం కొట్టి వేసిందని, ఈవీఎం టాంపరింగ్‌పై పిటిషనర్ చేసిన వాదనలను న్యాయస్థానం తిరస్కరించిందని తెలిపారు. ఎన్నికలలో ఓడినప్పుడు మాత్రమే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల విశ్వసనీయతను ప్రశ్నించడం సరికాదని, ఈవీఎంలు టాంపరింగ్ చేయబడవని వ్యాఖ్యానించిందని తెలిపారు.

వ్యాస రచన, ఉపన్యాస పోటీలు

నవతెలంగాణ-కాసిపేట

మడంలంలోని దేవాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో సామాజిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం సంధర్భంగా విద్యార్థులకు వ్యాచారచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో సామాజిక చైతన్య వేదిక ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు, హెచ్ఎం రాథోడ్ రమేష్, ముఖ్య సలహాదారు మద్దిలేని చిన్న భీమయ్య ఉపాధ్యాయులు అంజత్ పాషా, లచ్చన్న, రమేష్ పాల్గొన్నారు.

మహాసభల కరపత్రాలను విడుదల

నవతెలంగాణ-నస్పూర్

ఎస్సీఎస్టీ జర్నలిస్టుల ప్రథమ మహాసభల కరపత్రాలను మంగళవారం అదనపు కలెక్టర్ సభావత్ మోతిలాల్ విడుదల చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఎస్సీ,ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల శ్రీధర్ మాట్లాడుతూ నవంబర్ 29న భాస్కర ఆడిటోయం, బిర్లా సైన్స్ సెంటర్ బిర్లా మందిర్ రవీంద్ర భారతి ఎదురుగా హైదరాబాదులో జరగనున్న దళిత, గిరిజన జర్నలిస్టుల రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. సమాజంలో ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పనిచేసే జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి మహాసభలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలలో ఉన్న ఎస్సీఎస్టీ జర్నలిస్టులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జర్నలిస్టులు కొండ శ్రీనివాస్, తలారి సమ్మయ్య, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

సన్మానానికి దరఖాస్తులు

నవతెలంగాణ-నస్పూర్

విద్య, వైద్య, సాహిత్య, కళ, క్రీడా రంగాలలో ఉత్తమ సేవలు అందించిన, ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రతిభావంతులైన క్రైస్తవులు, క్రైస్తవ సంస్థల నుండి సన్మానాకి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 30 సంవత్సరాలకు పైబడిపై రంగాలలో ఉత్తమ సేవ, ప్రతిభ కనబరిచిన క్రైస్తవ వ్యక్తులు, సంస్థల నుండి నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని, నామినేషన్ ఫారాలు హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ (అల్పసంఖ్యాక) ఆర్థిక సంస్థ, మేనేజింగ్ డైరెక్టర్ కార్యాలయంలో, ఆన్‌లైన్లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీజీసీఎంఎఫ్సీ.ఇన్ లో పొందవచ్చని తెలిపారు. పూర్తిచేసిన నామినేషన్లను జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని మొదటి అంతస్తులో గల ఎఫ్-5 లో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో డిసెంబర్ 5వ తేదీలోగా అందజేయాలని తెలిపారు.

రేపు మినీ జాబ్ మేళా

నవతెలంగాణ-నస్పూర్

మంచిర్యాల పట్టణంలోని మెన్స్ డిగ్రీ కళాశాలలో నవంబర్ 28న ఉదయం గం.10.30లకు మినీ జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఉపాధి అధికారి ఎ.రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. హెటెరో ల్యాబ్స్ లిమిటెడ్-హైదరాబాద్ సంస్థలో ప్రొడక్షన్ విభాగంలో 30 జూనియర్ కెమిస్ట్/ట్రైనీ (బి. ఎస్ సి. కెమిస్ట్రీ/ బి. ఎ./బి. కాం), 30 జూనియర్ ఆపరేటర్/ట్రైనీ (ఎస్. ఎస్. సి./ఇంటర్మీడియట్), 30 జూనియర్ ఇంజనీర్/ట్రైనీ (ఐ.టి.ఐ.-ఫిట్టర్, డిప్లొమా- మెకానికల్/కెమికల్/ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్) పోస్టులను భర్తీ చేసేందుకు జాబ్ మేళా ఉంటుందన్నారు. 18-26 సంవత్సరాల వయసు కలిగి విద్యార్హత కలిగిన పురుష అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హైదరాబాద్ ప్రాంతంలో పని చేయల్సి ఉంటుందని, వివరాలకు 81210400358, 9059888389, 91103685010 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జిల్లాస్థాయి రాష్ట్రీయ బాల విజ్ఞాన్ ప్రదర్శన

నవతెలంగాణ-నస్పూర్

జిల్లా కేంద్రంలోని ట్రినిటీ ఉన్నత పాఠశాలలో నవంబర్ 30, డిసెంబర్ 1 తేదీలలో జిల్లాస్థాయి రాష్ట్రీయ బాల విజ్ఞాన్ ప్రదర్శన, ఇన్స్పైర్ అవార్డ్స్ మానక్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు ఈ ప్రదర్శన కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-మందమర్రి

విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శి అర్పిత మారంరెడ్డి అన్నారు. మంగళవారం జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా మంచిర్యాల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ఆదర్శ (మోడల్) పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై చట్టాలతో పాటు రాజ్యాంగ, జాతీయ న్యాయ దినోత్సవం గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి పెద్ద రాజ్యాంగ వ్యవస్థ భారత దేశ రాజ్యాంగమని తెలిపారు. ప్రతి సంవత్సరం నవంబరు 26న భారత రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకుంటామని, దీనినే సంవిధాన్ దివస్, జాతీయ న్యాయ దినోత్సవంగా కూడా జరుపుకుంటామని పేర్కొన్నారు. భారత రాజ్యంగం 1950నవంబర్ 26న అమలులోకి వచ్చిందని గుర్తు చేసారు. దేశంలోని ప్రతీ పౌరునికి ప్రాథమిక హక్కులు, విధులు రాజ్యాంగం ద్వారానే కల్పించబడుతాయని తెలిపారు. వీటిలో ఆర్టికల్ 14 సమానత్వపు హక్కు, ఆర్టికల్ 21 రైట్ టు పర్సనల్ లిబర్టీ, ఆర్టికల్ 21ఏ ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం 14సంవత్సరాలోపు బాలబాలికలకు, మహిళలకు ఆస్తిలో వాటా, మగవారితో సమానంగా పనికి తగిన వేతనం కల్పించబడిందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాములు, ఎన్‌జీఓ డిస్ట్రిక్ట్ విజిలెన్స్ కమిటీ సభ్యులు దేవరాజ్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికునికి రూ.25 వేల ఆర్థిక సాయం



నవతెలంగాణ-జన్నారం

తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి నాయకుడు దుమల ఎల్లయ్య గల్ఫ్ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో మంగళవారం రూ.25 వేల ఆర్థిక సాయం అందించారు. మండలంలోని పోన్కల్ గ్రామానికీ చెందిన దుమల్ల ఎల్లయ్యకి ఫుడ్ కట్టర్ మిషన్ ప్రమాదవశాత్తు చేతుల్లో నుండి జారిపోయి తన వీపుపై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్సలు పెద్ద మొత్తంలో ఖర్చు అవుతాయని తెలపడంతో స్పందించి ఆ గ్రామ గల్ఫ్ సంక్షేమ సమితి వ్యవస్థాపకులు రాష్ట్ర ఇన్‌చార్జి ఎరుకల రాజుగౌడ్ ఆర్థిక సాయం సమకూర్చి అందించారు. ఆ సంస్థ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కల్లెడ భూమయ్య, దుబాయ్ శాఖా అధ్యక్షులు మహమ్మద్ అలీం, మండల ప్రెసిడెంట్ పాలాజీ శ్రీనివాస్, రాష్ట్ర కన్వీనర్ సంద సుదర్శన్ పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఆర్ఐ

నవతెలంగాణ-తాండూర్

మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌గా ఏజాజోద్దీన్ బాధ్యతలు చేపట్టారు. రేచీని, అన్నారం, బల్లన్పూర్, అచలాపూర్, గంపలపల్లి, మాదారం, కొత్తపెల్లి, రేపల్లెవాడ, పెగడపల్లి, నర్సాపూర్, పెగడపల్లి అబ్బాపూర్ గ్రామాలకు సంబంధించిన రెవెన్యూ శాఖ కార్యక్రమాలను నిర్వహిస్తారని తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్ తెలిపారు. ఏజాజోద్దీన్ గతంలో తాండూర్ మండలంలో పనిచేశారు. నేషనల్ హైవే రోడ్డు వెడల్పు పల్లె ప్రకృతి వనాల క్రీడా మైదానాలు భూసేకరణ పనులలో విశేష సేవలు అందించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ తన పరిధిలోని రెవెన్యూ శాఖ పనులను సమర్థవంతంగా నిర్వహిస్తానని ఏజాజోద్దీన్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-లక్షెట్టిపేట

విద్యుత్ సరఫరాలో బుధవారం అంతరాయం ఉంటుందని ఏడీఈ ప్రభాకర్ రావు తెలిపారు. బుధవారం ఉదయం 9.30 గంటల నుండి నుండి 10.30 గంటల వరకు 132/33 కెవి శాంతాపూర్ సబ్ స్టేషన్‌లో మరమ్మత్తుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మహిళా సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



నవతెలంగాణ-తాండూర్

మహిళా సంఘాలను అభివృద్ధి పరిచేందుకు మహిళా శక్తి ఉపాధి భరోసా పథకం కింద ప్రభుత్వం ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా కుటీర పరిశ్రమలను నెలకొల్పుతోందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ తెలిపారు. ప్రజా పాలన విజయోత్సవాల సందర్భంగా మంగళవారం తాండూర్, బెల్లంపల్లి, కన్నెపల్లి మండలాల్లో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో మౌలిక వసతుల రూపకల్పనకు రూరల్ సానిటేషన్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ పథకంలో సీసీ రోడ్ల నిర్మాణం, అంగన్‌వాడీ, గ్రామపంచాయతీ బిల్డింగుల నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. పొలం బాట కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో రహదారుల అభివృద్ధికి ఉపాధిహామీ ద్వారా ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. తాండూరు మండలంలోని చౌటపల్లి గ్రామంలో రూ.12 లక్షలతో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు, తాండూర్ గ్రామపంచాయతీలో రూ.5 లక్షలతో సిసి రోడ్డు, నరసాపూర్‌లో రూ.20 లక్షల వ్యయంతోతో నిర్మించనున్న గ్రామపంచాయతీ భవనం, బెల్లంపల్లి మండలం తాళ్ల గురుజాల గ్రామపంచాయతీలో రూ.5 లక్షలతో ఓపెన్ జిమ్‌ను ప్రారంభించారు. కన్నెపల్లి మండలంలో పర్యటించి పలు అభివృద్ధి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కన్నెపల్లి మండలంలో జన్కపూర్ గ్రామపంచాయతీ రూ.3 లక్షల 50 వేల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సిసి రోడ్ సైడ్ డ్రైనేజ్, టేకులపల్లి గ్రామపంచాయతీలో రూ.20లక్షల నిధులతో నిర్మించే నూతన గ్రామపంచాయతీ భవనం, మండల కేంద్రంలో రూ.12 లక్షల నిధులతో నిర్మించే నూతన అంగన్‌వాడీ భవనానికి శంకుస్థాపన చేశారు. వీగం గ్రామపంచాయతీలో రూ.5 లక్షల నిధులతో సిసి రోడ్ సైడ్ డ్రైనేజ్ పనులను ప్రారంభించారు. అనంతరం కన్నెపల్లి మండల రైతు వేదికలో ప్రభుత్వ అధికారులతో కలిసి కల్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు.

ప్రజా ప్రభుత్వంలోనే పేద ప్రజలకు న్యాయం

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్
- గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

నవతెలంగాణ-జన్నారం

ప్రజా ప్రభుత్వంలోనే పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని, గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం మండలంలోని వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని, ప్రజా ప్రభుత్వంలో గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి పరచడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామన్నారు. ముందుగా మండలంలోని పొన్కల్ గ్రామంలో నూతన సీసీ రోడ్ నిర్మాణ పనులు, లోతుర్రే గోండుగూడా గ్రామంలో నూతన అంగన్‌వాడీ భవనం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మురిమడుగు గ్రామంలో పౌల్ట్రీ షెడ్లను ప్రారంభించారు. అదేవిధంగా ప్రజా పాలన విజయోత్సవ కార్యక్రమాలలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ వస్తుందన్నారు. లోతుర్రే గిరిజన గ్రామానికి వెళ్లడానికి వాగుపై వంతెన నిర్మాణానికి సహకరిస్తామన్నారు. ముందుగా మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పూల మాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్ష కార్యదర్శులు ముజాఫర్ అలీ ఖాన్, మేకల మాణిక్యం, నాయకులు ఏనుగు సుభాష్ రెడ్డి, ముత్యం రాజన్న, మిక్కిలినేని రాజశేఖర్, ఇసాక్, షాకీర్, జ్ఞానేశ్వర్, ముత్యం సతీష్, మత్స్య శంకరయ్య, పసివుల్లా, మహమ్మద్ రియాజుద్దీన్, మామిడిపల్లి ఇందయ్యా లక్ష్మీనారాయణ, దుర్గం గంగాధర్, దుమల రమేష్, నందు నాయక్ పాల్గొన్నారు.



రూ. 86 లక్షలతో 78 పనులు

- పనులు ప్రారంభించిన అధికారులు



నవతెలంగాణ-జైపూర్

మండల పరిధిలో గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వార రూ.86 లక్షలతో 78 పనులు గుర్తించినట్లు ఎంపీడీఓ సత్యనారాయణ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో ప్రజా పాలనా విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని పనులు ప్రారంభించామన్నారు. ఈ సంధర్భంగా పెగడపల్లి గ్రామంలో ఈజీఎస్ ద్వార నిర్మించ తలపెట్టిన పౌల్ట్రీ ఫామ్ షెడ్ నిర్మాణానికి జెడ్పీ సీఈఓ గణపతితో కలిసి భూమి పూజ చేసి రాజ్యాంగ పీఠిక చదివి గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. అదేవిధంగా కానుకూరు గ్రామంలో రూ.12 లక్షలతో నిర్మించనున్న అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ మనోరమ, ఎంపీఓ శ్రీపతి బాపురావు, ఈజీఎస్ ఏపీఓ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు రిక్కుల శ్రీనివాస్ రెడ్డి, ఫయాజోద్దీన్, సత్యనారాయణ రెడ్డి, విశ్వంబర్ రెడ్డి మాజీ గ్రామ పంచాయతీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత న్యాయవాదికి పరామర్శ

నవతెలంగాణ-ఖానాపూర్

దుండగుల దాడిలో తీవ్ర గాయాలపాలైన నిజామాబాద్ సీనియర్ న్యాయవాది ఖాసింను మంగళవారం ఖానాపూర్ న్యాయవాదులు ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజల హక్కులని పరిరక్షించడంలో ప్రధాన పాత్ర పోషించే న్యాయవాదులపై ఈ విధంగా దాడి చేయడం సరైన పద్ధతి కాదన్నారు. న్యాయవాదుల హక్కుల పరిరక్షణలో న్యాయవాదులంతా ఏకతాటిపై వచ్చి సమిష్టిగా కృషి చేయాలని అన్నారు. అలాగే న్యాయవాదుల పరిరక్షణ చట్టం రూపొందే వరకు న్యాయవాదులంతా ఉద్యమించాలని అన్నారు. పరామర్శించిన వారిలో నిజామాబాద్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు న్యాయవాదులు జగన్మోహన్‌గౌడ్, చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ రాజ్ సుబేదార్, ఖానాపూర్ న్యాయవాదులు వెంకట్ మహేంద్ర, మట్టేరి రాజశేఖర్, మహమ్మద్ ఆసిఫ్ అలీ, బాశెట్టి శివకుమార్, తోట సుమిత్, ఇర్ఫాన్ అలీ, మహమ్మద్ అలీ, ఇర్ఫాన్ ఖాన్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం మండలంలోని పిప్పిరి గ్రామంలో రూ.20లక్షలతో నూతన గ్రామ పంచాయతీ భవనం, లక్కుగూడ గ్రామంలో రూ.12లక్షలతో నూతన అంగన్వాడీ భవనం, దన్నోర(బి) గ్రామంలోని జడ్పీఎస్-ఎస్ పాఠశాలలో రూ.4లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న మరుగుదొడ్లకు భూమిపూజ చేశారు.



అదేవిధంగా పలువురిని పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి పరచడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా న్యాయసేవాధికార కార్యదర్శి సౌజన్య



నవతెలంగాణ-తలమడుగు

భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం న్యాయ వ్యవస్థ, చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా న్యాయసేవాధికార కార్యదర్శి బోనగిరి సౌజన్య మాట్లాడారు. రాజ్యాంగంతో పాటు చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. చట్టం అందరికీ సమానమైనప్పటికీ ఎలాంటి నేరాలకు పాల్పడకుండా సమాజంలో గొప్ప వ్యక్తులుగా మిగిలి పోవాలని తెలిపారు. జిల్లా కేంద్రంలో ఉచిత న్యాయ సేవ సహాయక కేంద్రం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. తమ కుటుంబంతో పాటు సమాజంలో అందరిని కూడా సమానంగా గౌరవించాలని కోరారు. న్యాయ సహాయం ఎలా పొందవచ్చు అవగాహనతో పాటు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజమోహన్, ఎంఈఓ వెంకట్‌రావు, డిప్యూటీ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ అరుగుల అశోక్, లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ ఉమేష్ డోలె, ఉపాధ్యాయులు వినోద్‌రెడ్డి, మురళీధర్, చంద్రమ్మ నర్సయ్య, శ్రీనివాస్, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవోపేతంగా అయ్యప్ప పడి పూజ



నవతెలంగాణ-భైంసా

వేలాది మంది స్వాములతో అయ్యప్ప పడిపూజ మహోత్సవం భైంసా మండలంలోని దేగాం గ్రామంలో మంగళవారం వైభవోపే తంగా జరిగింది. గ్రామానికి చెందిన ఏనుగు చంద్రశేఖర్‌రెడ్డి అయ్యప్ప మాలధారణ వేస్తూ, 18 సంవత్సరాలు గడిచిన సందర్భంగా నారికేళ మహా పడి పూజను నిర్వహించారు. ఎమ్మెల్యే పవార్ రామరావు పటేల్ మహోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించారు. అయ్యప్ప పల్లకి సేవా, స్వాముల నృత్యాలు, భజనలతో దేగాం గ్రామం అయ్యప్ప నామస్మరణతో మారుమ్రోగింది. నియోజకవర్గం నుంచి పెద్ద మొత్తంలో అయ్యప్ప మాలధారులు తరలివచ్చారు. మాల ధారణ ప్రాముఖ్యతను గురు స్వాములు వివరించారు. పడిపూజలో చేపట్టిన అభిషేక ఘట్టం కమనీయంగా కొనసాగింది.

నూతన మండలాలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

- బీఆర్ఎస్ నాయకుల సంబరాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గత ప్రభుత్వంలో జోగు రామన్న కృషితో నూతన మండలాలు సాధ్యపడ్డాయని ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, వైస్ ఎంపీపీ విజయ్ అన్నారు. జిల్లాలో నూతన మండలాల ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో బీఆర్ఎస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన సొనాల, సాత్నాల, భోరజ్ మండలాలను ఏర్పాటు చేస్తూ, ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో మంగళవారం పార్టీ కార్యాలయ ఆవరణలో సంబరాలు చేసుకున్నారు. మండలాల ఏర్పాటుతో ఆయా ప్రాంతాల వాసులు ఏండ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలు దూరం కానున్నాయని, గత ప్రభుత్వ కృషే ఇందుకు కారణమని నాయకులు పేర్కొన్నారు. టపాసులు పేలుస్తూ మిఠాయిలు తినిపించుకున్నారు. కార్యక్రమంలో ఉశన్న, ప్రభాకర్, వేణుగోపాల్ యాదవ్, కుమ్ర రాజు, సోనేరావ్, భోజన్న, బట్టు సతీష్, అడపా తిరుపతి, పురుషోత్తం, సంతోష్, విఠల్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనానికి భూమిపూజ



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని భరంపూర్ గ్రామంలో కొత్తగా నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవనానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మంగళవారం భూమిపూజ నిర్వహించారు. రూ.12 లక్షలతో నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవనాన్ని నాణ్యతగా నిర్మించి సకాలంలో పిల్లలకు అందే విధంగా చూడాలని తెలిపారు. మరిన్ని అంగన్‌వాడీ కేంద్రాలు మంజూరుకు కృషి చేస్తానని అన్నారు. అనంతరం భారత రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధి హామీ కూలీల తోపాటు గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ రాజ్ మోహన్, ఎంపీడీఓ శేఖర్, ఎంపీఓ సుధీర్‌రెడ్డి, మండల కన్వీనర్ తోట వెంకటేష్, బీఆర్ఎస్ నాయకులు కేదారీశ్వర్‌రెడ్డి, కిరణ్ కుమార్, అబ్దుల్లా, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రమాకాంత్, గ్రామస్తులు ప్రతాప్, నర్సయ్య, గంగారాం, సీడీపీఓ సురేఖ, ఏసీడీపీఓ నర్సమ్మ సూపర్‌వైజర్ విజయ, ఐకేపీ ఏపీఎం చంద్రశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

శైలజ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలి



నవతెలంగాణ-మంచిర్యాల

ఫుడ్ పాయిజన్‌కు గురై చికిత్స పొందుతూ మృతి చెందిన శైలజ కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో గురుకులాలు మృత్యు గృహాలుగా మారుతున్నాయన్నారు. ఆహారం విషతుల్యమై, అనారోగ్య కారణాలతో ఆత్మహత్య చేసుకుని ఎంతో మంది విద్యార్థులు మరణిస్తున్నారన్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తనట్లుగా వ్యవహరిస్తుందని తెలిపారు. విద్యార్థిని శైలజ మృతి బాధాకరమన్నారు. మృతికి కారణమైన అధికారులపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని, రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి సంఘటనలు వరుసగా జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం, అధికారులు స్పందించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థిని కుటుంబాన్ని అన్ని విధాల ప్రభుత్వం ఆదుకోవాలని, ఘటనకు బాధ్యులైన అధికారులను వెంటనే విధుల నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.శ్రీకాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఈదునూరి అభినవ్, ఏఐఎస్ఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సన్నీగౌడ్, నాయకులు సుమంత్, అంజి, రాహుల్ పాల్గొన్నారు.



కాసిపేట : ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే విద్యార్థిని శైలజ మృతి చెందిందని ఆదివాసీ సంఘాల నాయకులు మండి పడ్డారు. మంగళవారం దేవాపూర్‌లో కుమురం భీం చౌరస్తా వద్ద ఆదివాసీ సంఘాలు, విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే విద్యార్థిని మృతి చెందిందని నిరసన వ్యక్తం చేస్తూ రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెడ్మ కిషన్ మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే బాలిక చనిపోయిందని మండి పడ్డారు. బాలిక కుటుంబానికి నష్టపరిహారం కింద రూ.50 లక్షలు, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆ బాలిక మృతికి కారణమైన డీటీడీవో, ఏటీడీఏ, వార్డెన్, హెచ్ఎం, ఐటీడీఏ పీవోలను వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అధికారులను తొలగించకపోతే విద్యార్థి సంఘం, తుడుం దెబ్బ అనుబంధ సంఘాలతో ఐటీడీఏ వద్ద ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ ఆదివాసీ సంఘాల నాయకులు ఆడే జంగు, పెంద్రం హన్మంతు, మడావి అనంతరావు, ఆత్రం జంగు, కనక గోవర్ధన్, సిడాం శంకర్, పెంద్రం ప్రభాకర్, ఆత్రం మహేష్, మడావి ధర్మారావు, సిడాం జగన్, తరుణ్, రామారావు, లింగు, పవన్, అర్జున్, సాంబ పాల్గొన్నారు.



ఉట్నూర్ : విద్యార్థి శైలజ మరణం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ సిడం జంగుదేవ్ అన్నారు. మంగళవారం మండలంలోని మత్తడిగూడ గ్రామంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల వసతి గృహాలలో ఒకవైపు పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులు మరణిస్తుంటే, మరొకవైపు కాంగ్రెస్ పాలకులు ఏడాది పరిపాలన ఉత్సవాలు నిర్వహించడం తగదని అన్నారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థినీ చౌదరి శైలజ గత నెల రోజుల కింద ఫుడ్ పాయిజన్ కారణంగా నిమ్స్ ఆస్పత్రిలో చేరి నెలరోజులుగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లల్లో నెలకొన్న దుస్థితిని విద్యార్థి శైలజ మరణం తెలియపరుస్తున్నదని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఉత్సవాల పేరుతో ఆర్భాటం మానుకొని విద్యార్థులు ప్రజల సంక్షేమంపై దృష్టి పెట్టాలని, మృతి చెందిన విద్యార్థి శైలజ కుటుంబానికి రూ.15 లక్షల ఎక్స్ గ్రేషియాతో పాటు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కోకన్వీనర్, అశోక్, మోతీరాం, జనార్దన్ పాల్గొన్నారు.

ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అట్టగుడు వర్గాలు ముందుకు రావాలనే ఉద్దేశంతో అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించారని కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి ఆత్రం సుగుణ అన్నారు. మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని అంబేద్కర్ చౌక్‌లో అంబేద్కర్ విగ్రహానికి పార్టీ శ్రేణులతో కలిసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏ ఆశయం కోసమైతే అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించారో ఆ లక్ష్యం దేశంలో నేరవేరడం లేదన్నారు. అంబేద్కర్ ముందుండి కుల మతాలు లేకుండా స్వేచ్ఛంగా సమానత్వంగా అందరు ఉండాలనే రాజ్యాంగాన్ని రూపొందించారని తెలిపారు. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితులు కనిపించడం లేదన్నారు. పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని చూయిస్తే ప్రధాన మంత్రి పుస్తకమని అవహేళన చేశారన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ పాల్గొన్నారు. ప్రజాసేవా భవన్‌లో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి అంబేద్కర్ చిత్రపటానికి పూలామలలు వేసి నివాళు లర్పించారు. సమత ఫౌండేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు అనిల్ సామ్లె నాయకత్వంలో, అంబేద్కర్ మెమోరియల్ సమత సైనిక్ దళ్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ అధ్యక్షుడు భీంరావ్, భారతీయ బౌద్ధ మహసభ నాయకులు కాంతరావ్, రంగరావ్, నారాయణ, రమబాయి మహిళ మండల్ అధ్యక్షురాలు దయాశీల హుకే, కుశ్వర్తబాయి లాంఢ్గే పాల్గొన్నారు. నేహ్రు యువకేంద్రంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. దీన్ని ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రమేష్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో రామనంద తీర్థ ట్రస్టు ఇన్చార్జి దినేష్, డైరెక్టర్ చంద్రశేఖర్, ఎస్‌వైకే సిబ్బంది మజీద్, షబానా ఉన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కామర్స్ డిగ్రీ కళాశాలలో జాతీయ రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అతిక్ బేగం, వైస్ ప్రిన్సిపల్ గణపతి రఘు, ఎన్‌సీసీ కేర్ టేకర్ అధికారి చంద్రకాంత్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు యాకూబ్ అలీ, పృథ్వీరాజ్, గోపాల్, ముబారక్, శ్రీనివాస్ పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయ ఆవరణలో తెలంగాణ మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని జరిపారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ మాదిగా జిల్లా అధ్యక్షులు మల్యాల మనోజ్, జేఏసీ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మోతే బారిక్‌రావు, జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నక్క రాందాస్, జిల్లా కోశాధికారి లింగంపల్లి ప్రసన్నకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు కత్తి గంగాధర్ ఉన్నారు.



కలెక్టరేట్‌లో వీఆర్ఏ ఆత్మహత్యయత్నం

- రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఉద్యోగి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కలెక్టరేట్‌లో ఓ ఉద్యోగి పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన జిల్లాలో కలకలం రేపింది. నిర్మల్ జిల్లా ఖానాపూర్ వీఆర్ఏగా పనిచేసిన అభిషేక్ ఇతర శాఖలో సర్దుబాటు అయ్యాడు. అయితే ప్రస్తుత ఆదిలాబాద్ ఆర్డీఓ కార్యాలయ ఏఓ నరేందర్ ఒకప్పుడు ఖానాపూర్ తహసీల్దార్‌గా పనిచేశారు. బదిలీలలో భాగంగా ఆయన జిల్లాకు వచ్చారు. అయితే వీఆర్ఏ అభిషేక్ తన సర్వీస్ బుక్‌లో సంతకం పెట్టమని ఆదిలాబాద్ ఆర్డీఓ కార్యాలయానికి మంగళవారం వచ్చారు. అయితే ఏఓ సంతకం పెట్టకపోవడంతో విసుగు చెంది తన వెంట తీసుకువచ్చిన పురుగులమందును మధ్యాహ్నం మూడు గంటల 15 నిమిషాల సమయంలో తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. వీఆర్ఏ నోటి నుంచి నురుగు రావడంతో గమనించిన అధికారులు, సిబ్బంది అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. సమాచారం ఇచ్చినప్పటికీ అంబులెన్స్ రావడానికి ఆలస్యం కావడంతో సిబ్బంది కారులో రిమ్స్‌లో తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని చికిత్స పొందుతున్నాడని రిమ్స్ వైద్యులు పేర్కొన్నారు.

సర్వే వివరాలు స్పష్టంగా నమోదు చేయాలి

నవతెలంగాణ-నస్పూర్



ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ప్రక్రియలో సేకరించిన కుటుంబ సభ్యుల వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎలాంటి పొరపాట్లు లేకుండా స్పష్టంగా నమోదు చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్వే వివరాల నమోదు కేంద్రాన్ని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియలో ప్రత్యేక అధికారులు, సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లను నియమించి జిల్లాలోని అన్ని కుటుంబాల వివరాలను నిర్దిష్ట నమూనాలో పొందుపరిచిన అంశాల ప్రకారం పూర్తి స్థాయిలో సేకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో సేకరించిన సమాచారాన్ని నమోదు చేయడంలో డాటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చి ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఆపరేటర్లు ప్రతి రోజు వారికి కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి స్థాయిలో చేయాలని, ఎలాంటి అలసత్వం, నిర్లక్ష్యం వహించకుండా వివరాల నమోదులో శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి పి.రాజేశ్వర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును వేగవతం చేయాలి

నవతెలంగాణ-ముధోల్

మండలంలో బీజేపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు కోరి పోతన్న అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రియాశీలక సభ్యత్వాలను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. బూత్ లేవల్‌లో పటిష్టంగా సభ్యత నమోదు చేపట్టాలని అన్నారు. ఎప్పటికప్పుడు పూర్తి అయిన సభ్యత్వం ఫారాలను వెంటనే సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యత్వం నమోదు ఇన్‌చార్జి సతీష్‌రెడ్డి, సంస్థాగత ఇన్‌చార్జి ఉమేష్, అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ సుమన్, నాయకులు తాటివార్ రమేష్, శివరాం పాల్గొన్నారు.

డయాగ్నోస్టిక్ సెంటర్లు నిబంధనలు పాటించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



జిల్లా కేంద్రంలోని డయాగ్నోస్టిక్ సెంటర్లు ప్రభుత్వ నిబంధనలను పాటించాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి నరేందర్ రాథోడ్ సూచించారు. మంగళవారం పట్టణంలోని పలు డయాగ్నోస్టిక్ సెంటర్లను ఆయన సందర్శించి, ఇక్కడ కల్పిస్తున్న సౌకర్యాలు, వసతులు, ధరల పట్టిక తదితర వాటిని పరిశీలించారు. రికార్డులను సరి చూసి మ్యానువల్‌తో పాటు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో స్కానింగ్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ జిల్లాలో 40 డయాగ్నోస్టిక్ సెంటర్లు రిజిష్టర్ అయ్యాయని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను ప్రతి కేంద్రంలో అమలు చేయాలని సూచించారు. స్కానింగ్, ఎక్స్‌రే తీసిన వివరాలను ఎప్పటికప్పుడు ఎఫ్ ఫారం ద్వారా ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే స్కానింగ్, ఎక్స్‌రేలు తీయాలన్నారు. లింగానిర్ధరాణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వృత్తివిద్యా నైపుణ్యం పెంచడమే లక్ష్యం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలోని ఒకేషనల్ కళాశాలలో చదువుతున్న విద్యార్థుల వృత్తివిద్యా నైపుణ్యం పెంచడమే ఓజేటి(వృత్తిపై శిక్షణ) లక్ష్యమని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిణి కళ్యాణి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలలో ప్రథమ ద్వితీయ సంవత్సరాలు చదువుతున్న విద్యార్థుల ఓజేటి శిక్షణ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకేషనల్ విద్యార్థులు విద్యా సంవత్సరంలో తరగతుల్లో నేర్చుకునే వివిధ అంశాలను ఓజేటీలలో శిక్షణ పొందుతారన్నారు. అధ్యాపకులు శిక్షణ కేంద్రాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామదాస్, అధ్యాపకులు సతీష్, రవికిరణ్, జ్యోతి పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు సీపీపీ మినహాయింపు ఇవ్వాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్‌లో తగ్గింపు నుండి మినహాయింపు ఇవ్వాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కర్ణాగౌడ్ అన్నారు. జిల్లా ఖజాన అధికారి భానుమతికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీపీపై హైకోర్టు ఇచ్చిన తీర్పు తమకు కూడా అమలు చేయాలన్నారు. ఆసిఫాబాద్, వాంకిడి, కాగజనగర్, సిర్పూర్ -టి అర్హులైన వారికి సీపీపీ మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎకిరాల సుగుణకర్, పుల్లూరి శంకర్, కోశాధికారి వెంకన్న, శంకరయ్య, శ్యామ్‌రావు దుర్గే, అశోక్, హాసను, మహమూద్, మధుకర్, మహేందర్, సత్యనారాయణ, విద్యాసాగర్ పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాల్లో మౌళిక వసతుల కల్పనకు చర్యలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కేంద్ర ప్రభుత్వ పథకంతో జిల్లాలో గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కోసం చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే తెలిపారు. మంగళవారం న్యూఢిల్లీ నుండి కేంద్ర ప్రభారి రజత్ కుమార్ సైని అస్పిరేషనల్ జిల్లా కార్యకలాపాలలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ తో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అస్పిరేషనల్ జిల్లా బ్లాక్ క్రింద కేంద్ర ప్రభుత్వ నిధులతో జిల్లాలోని గిరిజన ప్రాంతాలలో చేపట్టే పనులను వివరించారు. ప్లాస్టిక్ వేస్ట్ ప్యాకేజీ యూనిట్లు, మిల్క్ ప్యాకేజింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులతో అంచనా ప్రతిపాదనలు రూపొందించి తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆస్పిరేషనల్ జిల్లా కార్యకలాపాలలో భాగంగా గిరిజనుల సంక్షేమ, అభివృద్ధి దిశగా చర్యలు చేపడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారాం, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీనారాయణ, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రామకృష్ణ, సంపూర్ణత అభియాన్ జిల్లా సమన్వయకర్త మణివేలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఈజ్‌గాం ఆలయంలో బోనాల పండుగ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాంలోని శ్రీ శివమల్లన్న స్వామి ఆలయంలో డిసెంబర్‌లో బోనాల పండుగ నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి గర్రెపల్లి వేణుగోపాల్ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్‌లో నాలుగు బుధవారాలు, నాలుగు ఆదివారాలలో ఈ పండుగ నిర్వహించనున్నామని వివరించారు. డిసెంబర్‌లో వచ్చే బుధవారాలు (తేదీలు 4, 11, 18, 25), ఆదివారాలు (తేదీలు 8, 15, 22, 29)లో ఈ పండుగ నిర్వహించనున్నామని, ప్రతీ బుధవారం సుమారు 5 వేల మంది, ప్రతి ఆదివారం సుమారు పది వేల మంది భక్తులు ఆలయానికి వచ్చి తమ మొక్కులను తీర్చుకుంటారని ఆయన వివరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు గాను ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు.

గ్రామాల సమస్యలు అధికారుల దృష్టికి తీసుకురావాలి



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

అన్ని గ్రామాల సమస్యలు మండలాధికారుల దృష్టికి తీసుకువస్తేనే సమస్యల పరిష్కారం అవుతాయని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని వర్తమన్నూర్ గ్రామంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అంగన్‌వాడి భవన నిర్మాణానికి రూ. 12 లక్షలు, సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.3 లక్షలతో చేపట్టే పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని ఎల్లప్పుడూ మీ అందరికి అండగా ఎమ్మెల్యేగా నేను ఉంటానని తెలిపారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్మికులకు, ఉపాధిహామీ కూలీలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు లక్ష్మణ్, రాజారాం, చంద్రశేఖర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాల స్థాయిలోనే వైకల్యాలను గుర్తించాలి



నవతెలంగాణ-ముధోల్

పాఠశాల విద్యార్థుల్లో వైకల్యాలను గుర్తించి, ప్రశాస్తా యాప్‌లో నమోదు చేసే బాధ్యత హెచ్ఎంలతో పాటు ఆయా తరగతి ఉపాధ్యాయులపై ఉంటుందని ఎంఈఓ రమణరెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల నుంచి జరుగుతున్న ప్రశాస్తా శిక్షణ ముంగిపు సందర్భంగా హాజరై ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో గుర్తించిన వైకల్యాలను మదింపు చేయడానికి, ఒకటో తరగతి నుంచి పదవ తరగతి వరకు ప్రతి విద్యార్థిని పరిశీలించి రిపోర్టును యాప్‌లో పొందుపర్చాలన్నారు. యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునే విధానాన్ని స్పెషల్ టీచర్ సాయికృష్ణ ఐఈఆర్పీ విజయ్ కుమార్ వివరించారు. సమావేశంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మండలాలకు చెందిన ప్రభుత్వ, ప్రయివేటు ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, సీఆర్పీలు ఎక్బల్, భూమన్న, రాములు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కేంద్రంలోని బీజేపీ నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాల నిరసిస్తూ జాయింట్ ప్లాట్‌ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్, సంయుక్తా కిసాన్ మోర్చా సంయుక్తంగా ఇచ్చిన నిరసన కార్యక్రమ పిలుపులో భాగంగా వివిధ రంగాల కార్మికులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను, అదేవిధంగా విద్యుత్ సవరణ బిల్లు-2012ను రద్దు చేయాలని, 73 షెడ్యూల్ పరిశ్రమల జీఓలను సవరించి, పెరిగిన ధరలకు అనుగుణంగా కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం కార్మిక, రైతు, వ్యవసాయ, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తూ, కార్పొరేట్ల ప్రయోజనం కోసం దేశ స్వాతంత్ర్యాన్ని, స్వాలంబనను తాకట్టు పెడుతుందని ధ్వజమెత్తారు. సీపీఐ(ఎం) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి చాంద్ పాషా మాట్లాడుతూ నూతన విద్యుత్ సవరణ బిల్లు-2022ను తెచ్చి, మెజార్టీ ప్రజలకు విద్యుత్ అందకుండా, మరల చీకటి అంధకారంలోకి నెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి త్రివేణి మాట్లాడుతూ 73 షెడ్యూల్ పరిశ్రమల జీఓలను గెజిట్ చేయకపోవడం వల్ల, ఆ పరిశ్రమలలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు లేక వచ్చే అరకొర జీతాలు సరిపోక, కార్మిక వర్గం అల్లాడిపోతున్న, అవేవీ పట్టనట్టు కార్పొరేట్ సేవల్లో మునిగిపోతున్న మోడీ ప్రభుత్వానికి రైతు, కార్మిక, ప్రజా ఐక్య పోరాటాలే బుద్ధి చెప్పే విధంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్ మాట్లాడుతూ మోడీ విధానవల్ల అన్ని వర్గాల ప్రజలు బాధపడుతున్నారని దీని నుండి బయటపడాలంటే ప్రజా సంఘాలు ప్రజలు ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాజేందర్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్, నాయకులు గంగామని, పద్మా స్వరూప, సభ్యులు వెలిశాల క్రిష్ణమాచారి, నగేష్, శారదా మాయ రూప, పద్మ సువర్ణ సందూర్ షావ్, కైలాష్, వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో..

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌక్ ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు దివాకర్, జిల్లా ఉపాధ్యక్షులు పిడుగు శంకర్, బి.సుధాకర్, మధుసూదన్, తిరుపతి, శ్రీనివాస్, దివాకర్ పాల్గొన్నారు.

దివ్యాంగులు మనో ధైర్యంతో రాణించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



దివ్యాంగులు మనోధైర్యంతో అన్ని రంగాలలో రాణించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా మహిళ, శిశు, వయోవృద్ధుల, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ గిరిజన క్రీడా పాఠశాలలో దివ్యాంగులకు నిర్వహించిన ఆటల పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు నిరుత్సాహపడకుండా అవకాశం ఉన్న ప్రతి రంగంలో మనోధైర్యంతో ముందుకు సాగాలన్నారు. దివ్యాంగులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని, మనం అందించే ప్రోత్సాహం ప్రతి రంగంలో రాణించేందుకు దోహదపడుతుందన్నారు. పోటీలలో గెలుపొందిన వారికి డిసెంబర్ 3న నిర్వహించే అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం వేడుకలలో బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్, జిల్లా గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి, గోళం వెంకటేష్, అథ్లెటిక్ కోచ్ విద్యాసాగర్, ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి రవికుమార్, పీడీ గుండం లక్ష్మణ్, మహిళా సాధికారత, సఖి సిబ్బంది సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శన విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని సెయింట్ మేరీ ఉన్నత పాఠశాలలో ఈనెల 27, 28 తేదీల్లో నిర్వహించే జిల్లా స్థాయి ఇన్ స్పైర్ మనాక్, బాల వైజ్ఞానిక ప్రదర్శనలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేకంగా నియమించిన కమిటీలు అంకితభావంతో కృషిచేసి విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య అన్నారు. వైజ్ఞానిక ప్రదర్శనల సన్నాహక సమావేశాన్ని పాఠశాలల్లో వివిధ కమిటీల బాధ్యులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 108 ఇన్స్‌పైర్ మనక్ ప్రాజెక్టులు, 200 పైగా బాల వైజ్ఞానిక ప్రదర్శనలు ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొంటాయని తెలిపారు. సుమారు 400 మంది జిల్లాలోని విద్యార్థులు, గైడ్ టీచర్లు తమ ప్రాజెక్టులతో పాల్గొని నూతన ఆవిష్కరణలను ప్రదర్శించనున్నట్లు వివరించారు. ఇందుకు అవసరమైన భోజన వసతి, ఉండడానికి వసతి, నీటి వసతి కల్పించే విషయంలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా శ్రద్ధ వహించాలన్నారు. ఆర్గనైజింగ్, ఆహ్వాన, స్టేజీ, కల్చరల్, ఆహ్వాన, రిజిస్ట్రేషన్ జ్యూరీ, డాక్యుమెంటేషన్, నీటి, భోజన వసతి తదితర కమిటీలను ప్రత్యేకంగా ప్రకటించి వారి బాధ్యతలను జిల్లా సైన్స్ అధికారి కటకం మధుకర్ వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఉదయబాబు, ఎంఈఓ ఆర్.సుభాష్, జిల్లాలోని ఎంఈఓలు, ఉన్నత పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, బాధ్యులైన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాఫ్ట్ బాల్, బేస్ బాల్ జిల్లా జట్టు ఎంపిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల మైదానంలో పాఠశాల క్రీడల ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ 17 బాల బాలికలకు సాఫ్ట్ బాల్, అండర్ 14 బాల బాలికలకు సాఫ్ట్ బాల్, బేస్ బాల్ జిల్లా జట్టు ఎంపిక పోటీలను జిల్లా విద్యాధికారి యాదయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలను చదువులో భాగస్వామిగా చేసుకోవాలన్నారు. దీనివల్ల మానసిక శారీరక పెరుగుదల సాధ్యమవుతుందని తెలిపారు. అనంతరం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి వెంకటేశం మాట్లాడుతూ జిల్లా స్థాయికి ఎంపికైన వారు బెల్లంపల్లిలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల మైదానంలో నిర్వహించే జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జులూరు యాదగిరి, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సట్ల శంకర్, గిరిజన క్రీడల జిల్లా అధికారి బండ మీనారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ అబ్దుల్ రహీం, సాఫ్ట్ బాల్ జాతీయ రిఫరీ కోట యాదగిరి, ప్రసాద్, శారద స్వరూప, రజిత, అరవింద్, జ్ఞానేశ్వరి, లక్ష్మి వివిధ పాఠశాల నుంచి పీడీ, పీఈటీలు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్‌కు మద్దతు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



విద్యార్థి శైలజ మృతికి సంతాపంగా నేడు నిర్వహించి తలపెట్టిన జిల్లా బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్ అన్నారు. జిల్లా కేంద్రంలో ప్రజా సంఘాల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ తీవ్ర అస్వస్థతకు గురై 25 రోజులు వెంటిలేటర్‌పై చికిత్స పొందిన ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. విద్యార్థిని కుటుంబానికి న్యాయం జరిగే వరకూ పోరాడుతామన్నారు. ప్రజా సంఘాలు ఇచ్చిన బందు పిలుపుకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీకానంద్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, వివిధ సంఘాల నాయకులు చిరంజీవి, తిరుపతి పాల్గొన్నారు.

మార్చి 31 నాటికి పూర్తి చేయాలి

- ఈజీఎస్ పనులు ప్రారంభించిన ఎంపీడీఓ



నవతెలంగాణ-కెరమెరి

ఉపాధి హామీలో ప్రారంభించిన పనులను మార్చి 31 నాటికి పూర్తి చేయాలని ఎంపీడీఓ అంజాద్ పాషా అన్నారు. మంగళవారం మండలంలోని వివిధ పంచాయతీలలో ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను ప్రజలు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశువుల పాక, వ్యవసాయ బావులు, ఎంపీటీ, వ్యవసాయ పొలాలకు రోడ్లు, పౌల్ట్రీ ఫార్మ్, ప్రతి గ్రామపంచాయతీకి నర్సరీ తదితర పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం వంద రోజులు పూర్తి చేసుకున్న ఉపాధి హామీ కూలీ, సక్రమంగా ప్లాంటేషన్ చేసిన వ్యక్తితో పాటు పారిశుధ్య పనులను సక్రమంగా చేపట్టిన ఒక కార్మికునికి శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఏపీఓ మల్లయ్య, కొఠారి గ్రామ పంచాయతీ కార్యదర్శి సతీష్ రావు పాల్గొన్నారు.

దేశ పౌరులుగా గర్వించాలి

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా గోలేటిలోని జీఎం కార్యాలయం ఆవరణలో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత విలువలు గల ప్రజా జీవన విధానం, ప్రజాస్వామ్య దేశంగా మంచి పేరు రావడానికి కారణం మన రాజ్యాంగమేనని అన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు బయ్య మొగిలి, ఎస్ఓ టూ జీఎం కె.రాజమల్లు, ఏరియా ఇంజినీర్ భీంరావ్ జాడే, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్ కుమార్ బెహరా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్ పాల్గొన్నారు.

జాతీయ క్రైస్తవ ప్రార్థనల పోస్టర్లు విడుదల

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఈ నెల 27న హైద్రాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న జాతీయ క్రైస్తవ ప్రార్థనల పోస్టర్లను మంగళవారం జిల్లా క్రిస్టియన్ జేఏసీ నాయకులు విడుదల చేశారు. టీచర్స్ కాలనీలో ఉన్న మన్నా బ్రదరన్ చర్చిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడుతూ మధ్యాహ్నం 3 గంటలకు ఈ ప్రార్థనలు నిర్వహించబడుతాయని, దీనికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు క్రిస్టియన్ జేఏసీ జాతీయ నాయకులు హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్రిస్టియన్ జేఏసీ జిల్లా అధ్యక్షులు యేసు కుమార్, ఆసిఫాబాద్ నియోజకవర్గ అధ్యక్షులు రాజరత్నం, నాయకులు పొన్నాల తిమోతి, ఈసక్ రాంచందర్ నాయక్, జెజెఎల్ మూర్తి పాల్గొన్నారు.

అభివృద్ధిలో పరుగులు పెడుతున్న ప్రజా ప్రభుత్వం



నవతెలంగాణ-లక్సెట్టిపేట

ప్రజా ప్రభుత్వ పాలనలో అభివృద్ధి పరుగులు పెడుతోందని మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్‌చంద్ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా మంగళవారం మండలంలోని వివిధ గ్రామాలలో పనుల జాతర నిర్వహించి అభివృద్ధి పనులకు భూమి పూజ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు నియోజకవర్గం అభివృద్ధికి నిధులు తీసుకొచ్చి పనులు చేయిస్తున్నారని తెలిపారు. ఉపాధి హామీ కింద రూ. 1.50కోట్లతో పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఎల్లారంలో గ్రామ పంచాయతీ భవనం, అంకతిపల్లిలో సిసి రోడ్, సూరారంలో గ్రామ పంచాయతీ భవనానికి ప్రహరీగోడ నిర్మాణం పనులకు భూమి పూజ నిర్వహించారు. భవిష్యత్తులో ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అరిఫ్, పంచాయతీరాజ్ రాజీవ్ గాంధీ సంఘటన్ జిల్లా అధ్యక్షులు గడ్డం త్రిమూర్తి, ఎంపీడీఓ సరోజ, ఎంపీవో శ్రీనివాస్, ఏపిఓ వేణు, ఈసి స్వామి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు పింగిలి రమేష్, నాయకులు కందుల మోహన్, బొప్పు సుమన్, అక్కల వెంకటేశ్వర్లు, అనవేణి భాను, పోచుకుమార్, మల్లిఖార్జున్, పోచమల్లు పాల్గొన్నారు.

డిసెంబర్ 1న ఛలో హైదరాబాద్

నవతెలంగాణ-నార్నూర్

డిసెంబర్ 1న ఛలో హైదరాబాద్‌లో నిర్వహించే మాలమహానాడు సమావేశాన్ని విజయవంతం చేయాలని మాల మహానాడు మండలాధ్యక్షుడు లోఖండే చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని త్రిరత్న బుద్ధవిహార్‌లో అంబేద్కర్ అసోసియేషన్, అంబేద్కర్ యూత్, విశాఖ మహిళా మండలి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఉమ్మడి మండలం నుంచి భారీ సంఖ్యలో వచ్చి మాలమహానాడు సభను విజయవంతం చేయాలన్నారు. తరతరాలుగా తాత ముత్తాతల నుంచి కలిసి ఉంటున్న ఎస్సీ కులాలను వర్గీకరణ చేస్తూ విడగొట్టడం సరికాదన్నారు. సింహగర్జనకు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవరావ్ లోఖండే, కాంతారావ్, కేశవ్‌రావ్, బ్రిజ్‌లాల్, సునీల్, విఠల్, ప్రకాష్, సంతోష్, శాంతారావ్, హేమలత, రుక్మిణి, నిర్మల ఉన్నారు.